# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :24 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 21-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు

జనగామ: గత హరితహారంలో నాటిన మొక్కలను కాపాడుకుంటూ వచ్చే హరితహారం కార్యక్రమం కోసం సిద్దంగా ఉండాలని అధికార యంత్రాంగానికి జిల్లా డిఆడిఎ అధికారులు సూచించారు. ఏగువప్రాంత జనగామ జిల్లాలో మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పెద్దఎత్తున నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గతేడాది నాటిన మొక్కలు ఎండిపోకుండా కాపాడాలనిఅన్నారు. స్థానిక అధికారులు వాటి రక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. మొక్కల సంరక్షణ కమిటీలు మండల, డివిజన్ స్థాయిలలో ఉంటాయన్నారు. జాతీయ రహదారి వెంట నాటిన మొక్కల సంరక్షణకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కమిటీలు వేయనున్నామని తెలిపారు. జనగామ జిల్లాలో తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా ఈఏడాది పెద్దఎత్తున మొక్కలు నాటాలని, గతంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకునే దిశగా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తగిన సూచనలు చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నర్సరీల్లో మొక్కల పెంపకానికి అటవీశాఖ, డీఆర్‌డీఏ

## కాంగ్రెస్‌ది బుజ్జగింపు రాజకీయం..



న్యూఢిల్లీ,కర్ణాటక రాజకీయాలు మరోసారి వేడెక్కాయి.. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో వక్ఫ్ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించింది. తీర్మానాన్ని లా అండ్ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్‌కె పాటిల్ ప్రతిపాదించారు. రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించే నిబంధనలను కలిగి ఉన్న వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024ను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం.. తీర్మానం చేసింది.. కాగా.. అంతకుముందు ప్రభుత్వ కాంట్రాక్ట్‌ల్లో మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సిద్దరామయ్య సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. వక్ఫ్ బిల్లును వ్యతిరేకించడం.. అలాగే మైనారిటీలకు రిజర్వేషన్ల అంశంపై బీజేపీ ఆగ్రహం వ్యక్తంచేసింది. మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని బీజేపీ స్పష్టం చేసింది. ఓటు బ్యాంక్ రాజకీయాల్లో భాగంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని బీజేపీ మండిపడుతోంది.. ఈ విషయంపై తాజాగా.. ఈ విషయంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి స్పందించారు. కర్ణాటక అసెంబ్లీ వక్ఫ్ (సవరణ) బిల్లు, 4% రిజర్వేషన్ల వివాదాన్ని తిరస్కరించడంపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ..ఇది బుజ్జగింపు రాజకీయం అంటూ పేర్కొన్నారు.. సుప్రీంకోర్టు కూడా, ఆర్టికల్ 15 క్లాజ్ 1 కింద, మీరు మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వలేరని చెప్పిందని.. జోషి గుర్తుచేశారు.కర్ణాటకలోని వక్ఫ్ విషయంలో ఏమి జరుగుతోందో ప్రహ్లాద్ జోషి వివరించారు.. వక్ఫ్ బోర్డు పేరుతో భూమిని లాక్కుని, పండించిన పంటలను బుల్డోజర్‌తో నాశనం చేసినందుకు తన నియోజకవర్గానికి ఆనుకొని ఉన్న ఒక రైతు ఆత్మహత్య చేసుకున్నాడని అలాంటి సంఘటనలు చాలా ఉన్నాయంటూ పేర్కొన్నారు.రాహుల్ గాంధీ నాయకత్వంలోని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా బుజ్జగింపు రాజకీయాలలో నిమగ్నమై ఉందని విమర్శించారు. కర్ణాటక బుజ్జగింపు రాజకీయాల ప్రయోగశాలగా మారిందని.. అయితే.. ఇలాంటి నిర్ణయాలు పనిచేయవని పేర్కొన్నారు. తాము ఈ అంశాన్ని దేశవ్యాప్తంగా లేవనెత్తుతాము.. అంటూ ప్రహ్లాద్ జోషి స్పష్టంచేశారు.

## మాది సంక్షేమ ప్రభుత్వం... మంత్రి సీతక్క

బయ్యారం, మార్చి 20: తమది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలను అభివృద్ధి పరచడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందిన నాడే దేశం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని, గాంధీ మహాత్ముని మాటలను నిజం చేయడం కోసం పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందన్నారు.బయ్యారం, గార్ల మండలాల్లో రైతులు రెండు పంటలు పండే విధంగా దేవాదుల నుండి ఎత్తిపోతల ద్వారా బయ్యారం చెరువుకు నీరు తరలిం చేందుకు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి కృషి చేస్తానని రైతులకు తెలిపారు. ఈకార్యక్రమంలో కలెక్టర్



అద్వైత కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కెకన్, తహసీల్దార్ విజయ, ఎంపీడీఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన...



హైదరాబాద్, ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలంలోని రామచంద్రాపురం గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో సరైన అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. అయితే, గత 15 నెలలుగా ఇందిరమ్మ పాలనలో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తోందని తెలిపారు. ప్రతి పేదవాడికి అండగా నిలిచే విధంగా ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు.రాష్ట్రం అప్పుల బాదుడులో ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే 57,626 ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో 10 లక్షల రూపాయల వరకూ ఉచిత వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తామని వెల్లడించారు. దేశ చరిత్రలోనే తొలిసారి సన్న బియ్యానికి 500 రూపాయల బోనస్ అందించిన ప్రభుత్వం తమదేనని తెలిపారు.యువత కోసం ఉపాధి కార్యక్రమాలు: నిరుద్యోగుల ఉపాధి కోసం 'రాజీవ్ యువ వికాస్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు చెప్పారు.గత ప్రభుత్వ పాలనలో ఎన్నో అక్రమాలు జరిగాయని, వాటిని సరిచేస్తూ అప్పులను తీర్చుతున్నామని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అలాగే, మళ్లీ అధికారంలోకి వస్తామంటూ కలలు కంటున్నారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మండిపడ్డారు. రామచంద్రాపురం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టినట్టు మంత్రి వెల్లడించారు. ఇంకా మిగిలిన అర్హులందరికీ ఇళ్ల మంజూరుకు సంబంధించి అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఫారెస్ట్ , ప్రైవేట్ భూముల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మాజీ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుపై అలసత్వం వహించిందని విమర్శించిన పొంగులేటి, ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే చెరువులు నిండుగా ఉండేలా నీటి సరఫరా నిరంతరంగా ఉంటుందని, రైతులకు సాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలు గమనించి, భవిష్యత్తులో జరిగే ఏ ఎన్నికల్లోనైనా ఇందిరమ్మ ప్రభుత్వానికి మద్దతు తెలియజేయాలని మంత్రి పొంగులేటి ప్రజలను కోరారు.

## ఎన్నికల హామీలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలి..



బేగంపేట్, మార్చి 20 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని, ప్రజలు ఎదురు చూస్తున్నారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని తహసిల్దార్ కార్యాలయంలో సికింద్రాబాద్, అమీర్‌పేట తహసిల్దార్ మండలాల పరిధిలోని 69 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల క్రింద మంజూరైన ఆర్ధిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు.సికింద్రాబాద్ తహసిల్దార్ పరిధిలో 37 చెక్కులలో 20 కళ్యాణలక్ష్మి, 17 షాదీముబారక్, అమీర్ పేట తహసిల్దార్ పరిధిలో 15 మందికి కళ్యాణలక్ష్మి కింద చెక్కులను పంపిణీ చేశారు. చెక్కుల కోసం వచ్చిన పలువురు లబ్దిదారులు తులం బంగారం ఎప్పుడు ఇస్తారు సారూ అని అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఇప్పటి వరకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల వెంట ఇస్తామన్న తులం బంగారం హామీ అమలుకు నోచుకోలేదని, లబ్దిదారులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని చెప్పారు. అంతేకాకుండా మహిళలకు 2500 రూపాయల ఆర్ధిక సహాయం కూడా అమలు కావడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, లేకుంటే ప్రజల నుండి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున వ్యతిరేకత ఎదురు కానున్నదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, సికింద్రాబాద్ తహసిల్దార్ పాండు నాయక్, అమీర్ పేట తహసిల్దార్ కార్యాలయ అధికారులు కిరణ్ కుమార్, కుమార స్వామి, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు ప్రేమ్ కుమార్, శేఖర్, లక్ష్మీపతి, కూతురు నర్సింహ, రాజేష్ ముదిరాజ్, ఆంజనేయులు, మహేష్ యాదవ్, బలరాం, జమీర్, నోమాన్, వనం శ్రీనివాస్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవానికి దూరంగా రాష్ట్ర బడ్జెట్ : తలసాని

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉన్నదని, అది తూతూ బడ్జెట్ అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం సికింద్రాబాద్‌లోని తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించిన నిధులలో ఎంత మేర ఖర్చు పెట్టారో కూడా ప్రజలకు స్పష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ లో పొందుపర్చడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు గత బడ్జెట్ లో కూడా ప్రకటించారని, ఎక్కడ ఇచ్చారో చూపిస్తారా అని ప్రశ్నించారు. అధికారం కోసం అనేక రకాల హామీలు ఇచ్చి ప్రజలకు లేనిపోని ఆశలు కల్పించారని, అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా హామీలు అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. వరద ముంపు సమస్య పరిష్కారం కోసం నాలాలలో పూడిక తొలగింపు పనులకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు పూడిక తొలగింపు పనులు ప్రారంభించలేదని, ఇంకెప్పుడు చేపడతారని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్రాగునీటికి కటకట ఏర్పడిందని, ట్యాంకర్ లే దిక్కు అన్నట్లుగా పరిస్థితి మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వం ఊక దంపుడు ప్రసంగాలను మానుకోవాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ చిత్తశుద్దిని నిరూపించుకోవాలని చెప్పారు.

## ఔరంగాజేబు సమాధి వివాదంలోకి చంద్రబాబును లాగిన ఉద్ధవ్..

ముంబై:ఔరంగజేబు 300 ఏళ్ల క్రితం మరణిస్తే ఇప్పుడు సమాధి తవ్వాల్సిన అవసరం ఏంటని ఉద్దవ్ ఠాక్రే ప్రశ్నించారు. ఒకవేళ సమాధిని తొలగించాలనుకుంటే.. ఎన్డీయేలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌ను పిలవాలన్నారు. మహారాష్ట్రలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధి చుట్టూ జరుగుతున్న రాజకీయ వివాదం దుమారం రేపుతోంది. నాగ్‌పూర్ మార్చి 17న జరిగిన హింసాత్మక ఘటనలో 34 మంది గాయాలపాలయ్యారు. అయితే తాజాగా ఈ నాగ్‌పూర్ ఘటనపై మాజీ సీఎం, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే కీలక వ్యాఖ్యలు చేశారు. ఔరంగజేబు 300 ఏళ్ల క్రితం మరణిస్తే ఇప్పుడు సమాధి తవ్వాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఒకవేళ సమాధిని తొలగించాలనుకుంటే.. ఎన్డీయేలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌ను కూడా పిలవాలని సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్, బిహార్‌లో ముస్లిం ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకొని పరోక్షంగా చంద్రబాబు, నితీశ్‌కుమార్ పేర్లను ప్రస్తావించారు. ఈ ఏడాది చివర్లో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అందుకే ఆయన నితీశ్ కుమార్ పేరును కూడా ప్రస్తావిచారు. ఈ నాగ్‌పూర్ హింసాత్మక ఘటన వెనుక ఎవరున్నారని మీడియా ఉద్ధవ్‌ను ప్రశ్నించింది. దీని ఆయన స్పందిస్తూ.. " ఈ హింస వెనుక ఎవరున్నారో సీఎంను అడగండి. ఇక్కడ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉంది. ఔరంగజేబు 300 ఏళ్ల క్రితం మరణిస్తే ఇప్పుడు సమాధి తవ్వాల్సిన అవసరం ఏంటి?. ఒకవేళ సమాధిని తొలగించాలని అనుకుంటే మీ మిత్రులు



చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్‌ను కూడా ఆహ్వానించండని" ఉద్దవ్ ఠాక్రే అన్నారు. ఇదిలాఉండగా.. ఛత్రపతి శివాజీ మహారాజ్ కొడుకు శంభాజీ జీవిత చరిత్ర ఆధారంగా ఇటీవల ఛావా సినిమా రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఔరంగజేబు శంభాజీని ఎలా చిత్రహింసలకు గురిచేసి అత్యంత క్రూరంగా ప్రాణాలు తీశారో చూపించారు. ఈ సినిమా చూసిన తర్వాత ఔరంగజేబుపై మరాఠాలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఈ క్రమంలోనే ఔరంగజేబు సమాధిని ధ్వంసం చేస్తామని ఓ వర్గం హెచ్చరించింది. దీంతో ఇది నాగ్‌పూర్‌లో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. నాగ్‌పూర్ హింసపై డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే కూడా శాసనమండలిలో ప్రసంగించారు. మరోవైపు ఔరంగజేబు అత్యంత క్రూరమైన వ్యక్తి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బోగస్ మాటలు తప్ప.. రేవంత్ ఒరగబెట్టిందేమీ లేదు..



బాన్సువాడ, మార్చి 20 : బోగస్ మాటలు, ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుభేర్ విమర్శించారు. గురువారం బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.రైతుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదన్నారు. ముఖ్యంగా 2 లక్షల రుణమాఫీ ఎంత మంది రైతులకు చేశారో చెప్పాలని, ఉపాధి హామీ కూలీలకు 12 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటికి ఇచ్చిన పరిస్థితి లేదని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా మహిళలకు ఉచిత బస్ పెట్టారని బస్సుల్లో సీట్లు దొరకక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు.రైతు భరోసా పథకంలో ఏడున్నర వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, కేవలం రూ. 6 వేలు కొంతమందికి వేసి చేతులు దులుపుకున్నారని ఎద్దేవ చేశారు. అంతేకాకుండా మహిళలకు కల్యాణ లక్ష్మీ పథకం లక్ష రూపాయలతో పాటు, తులం బంగారం అని చెప్పిన రేవంత్ సర్కార్ 15 నెలలు గడుస్తున్నా అమలు చేయలేదని మండిపడ్డారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం, ఆగ్రో చైర్మెన్ కాసుల బాలరాజు, ఏనుగు రవీందర్ రెడ్డిలు వారి వర్గ పోరు తప్పా, నియోజక వర్గానికి చేసిందేమీ లేదన్నారు. రైతుల పరిస్థితి తెలిసిన వ్యక్తి , గత ప్రభుత్వంలో రైతు మంత్రిగా, ప్రస్తుతం వ్యవసాయ సలహాదారుడిగా వ్యవహరిస్తున్న పోచారం నియోజక వర్గ ప్రజల స్థితిగతులపై ఎందుకు అసెంబ్లీలో నోరు విప్పడం లేదని ప్రశ్నించారు.బీఆర్ఎస్ పార్టీ లో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, నియోజకవర్గ ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గృహజ్యోతి పేరుతో పేదల ఇంటి కరెంట్ బిల్లుల కోసం ఆన్‌లైన్‌లో అప్లైకి పోతే, ఆన్‌లైన్ బంద్ ఉంటుందని ఆయన తెలిపారు. అంతేకాకుండా బాన్సువాడను జిల్లా చెయ్యాలని డిమాండ్‌తో నిరాహార దీక్షలు చేసిన ఆగ్రో చైర్మెన్ కాసుల బాలరాజు, ఇప్పుడు ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి వెంటనే బాన్సువాడను జిల్లాగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిబాబా, మోచి గణేష్, గాండ్ల కృష్ణ, అఫ్రోజు, శంకర్, రాములు, బాలయ్య, అంజయ్య, మొగులయ్య, విట్టల్, జీవన్, అనిల్, రాజు కుమార్, నర్సింలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### గాంధారిలో కారు బీభత్సం.. కానిస్టేబుల్ మృతి

గాంధారి, మార్చి 20 : పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల పైకి అతివేగంగా ఓ కారు దూసుకురావడంతో ఒక కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన గాంధారి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాంధారి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న రవి, సుభాష్ అనే ఇద్దరు కానిస్టేబుళ్లు గురువారం తెల్లవారుజామున 3 గంటలకు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. బస్టాండ్ సమీపంలోని హనుమాన్ టిఫిన్ సెంటర్ వద్ద తమ ద్విచక్ర వాహనాన్ని ఆపుకొని అక్కడ నిలుచున్నారు.అదే సమయంలో కామారెడ్డి వైపు నుండి వేగంగా వచ్చిన

## బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో తిరగండి...రాజాసింగ్‌కు పోలీసుల అలర్ట్



హైదరాబాద్,హైదరాబాద్‌లోని గోషామహల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మంగళ్‌హాట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వరుసగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సిటీ పోలీసులు అప్రమత్తం చేశారు. టూ వీలర్ బుల్లెట్ వాహనంపై తిరగవద్దు అంటూ హెచ్చరించారు.ప్రభుత్వం కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలోనే తిరగాలని పోలీసులు సూచించారు. సెక్యూరిటీ థ్రెట్ ఉన్న నేపథ్యంలో గన్‌మన్‌ల సంరక్షణలోనే ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వం కేటాయించిన 1o4 సెక్యూరిటీని సద్వినియోగం చేసుకోవాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే గత నెల రోజులుగా రాజాసింగ్‌కు ఆగంతకుల నుంచి వరుసగా బెదిరింపు కాల్స్ వస్తున్నా యని, ఇవాళ కాకపోతే రేపు అయినా అంతు చూస్తామంటూ రాజాసింగ్‌కు బెదిరింపులు వస్తున్నాయి.గుర్తు తెలియని ఫోన్ నంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నట్లుగా ఆయన అనుచరులు కూడా తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోలీసులు అలర్ట్ చేశారు. సెక్యూరిటీ విషయంలో పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కోరారు.

## సంపాదకీయం

శుక్రవారం 21-03-2025

# ప్రజల్లో తగ్గుతున్న కొనుగోలు శక్తి

పెరుగుతున్న ఆర్థిక మాంద్యం, ధరల పెరుగుదలకు తోడు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగం తాండవిస్తోంది. దీనికితోడు ప్రల కొఉగోలు శక్తి పూర్తిగా సన్నగిల్లుతోంది. గ దశాబ్దంలో పేదలు బరీ పేదలుగా మారారు. పెద్దలు మరింత పెద్దపెద్ద భవంతులకు చేరుతున్నారు. వారికి డబ్బులు సమకూరుతోంది. ముఖ్యంగా దిగువ మధ్యతరగతి ప్రజలు మరింత పేదలుగా మారుతున్నారు. నిత్యాసవసర వస్తువులను కొనుగోలు చేసే శక్తి సన్నగిల్లుతోంది. ఇదంతా కూడా ఆర్థిక సంక్షోభానికి పరాకాష్టగా చూడాలి. కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర భారత్,ఆ తరువాత వికసిత్ భారత్ అని చెబుతూ, ఆర్థికంగా భారత్ బలోపేతంగా మారిందని నమ్మబలుకుతున్నారు. గ్రామాల్లో పేదల స్థితిగతులు మరితం దుర్భరంగా మారయి, మధ్యతరగతి ప్రజలు తిండికి, వైద్యానికి కూడా నోచుకోవడం లేదు. ఆస్పత్రుల బిల్లులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ప్రభుత్వం వూద్యం అందడం లేదు. కరోనా అనంతరం మళ్లీ ఆదాయాలు పుంజుకొని అభివృద్ధి ఉరకలు వేస్తుందన్న గారడీ మాటలను ప్రజలు నమ్మడం లేదు. గతంలో క్షీణించిన వృద్ధి రేటు తిరిగి పెరుగుతూ పోతుందన్నారు. బిజెపి పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టదిశగా పరిణామం చెందుతోందన్నారు. అంటే కొద్దిమంది సంపన్నుల సంపద పెరుగుతోందనీ అత్యధికులుగా వున్న మధ్యతరగతి, పేదలు ఇంకా కునారిల్లుతున్నారని గుర్తించడం లేదు.ప్రపంచంలో పేదరికం తగ్గింపు కోసం అనేక దేశాల్లో ఆయా ప్రభుత్వాలు ఆర్థిక విధానాలను రూపొందిస్తున్నాయి. అయితే ముఖ్యంగా సోషలిస్టు దేశాలు ఆదాయ అంతరాల తగ్గింపు కోసం కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా సంపద పోగు పడుతున్న వారి నుండి అధిక పన్నులు వసూలు చేయడం, మధ్య, అల్పాదాయ వర్గాల వారికి ప్రభుత్వ తోడ్పాటు పెంచడం వంటి విధానాలు అనుసరిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ పాత్రను పెంచుతున్నాయి. ఇంకొన్ని దేశాల్లో ఆదాయంలో పన్ను చెల్లింపు వాటాను కొలబద్దగా తీసుకొని, అధికాదాయ వర్గాలవారి నుండి ఎక్కువగా వసూలు చేస్తున్నారు. అంతరాల తగ్గింపు లక్ష్యంగా వివిధ చర్యలు చేపడుతున్నారు. అందుకు భిన్నంగా నరేంద్ర మోడీ పాలనలో సంపన్నులపై విధించే కార్పొరేట్ పన్ను తగ్గించారు. వారు బ్యాంకులకు చెల్లించవలసిన లక్షల కోట్ల రూపాయల రుణాన్ని మాఫీ చేశారు. ప్రోత్సాహకాల పేరిట కేంద్ర బడ్జెట్‌లో ఏటా లక్షల కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నారు. మరోవైపున మధ్యతరగతి వారిపై విధించిన ఆదాయ పన్ను ఖజానాకు ఏడాదికేడాది ఎక్కువగా పోగుపడుతోంది. ఇక పేదలను ఎంతలా దిగజార్చుతున్నదీ అందరికీ తెలిసిన విషయమే! ప్రభుత్వ విధానాలే ఆదాయ అంతరాల పెరుగుదలకు కారణం కనుక వాటిని మార్చాల్సిందే. అందుకు బలమైన ప్రజా ఉద్యమాలు కావాలి. తాజా ఆదాయ అంతరాల నివేదిక ఈ విశ్లేషణ ఎంత సత్యమో విదితపరుస్తోంది. దేశంలోని సంపన్నులు జాతీయాదాయంలో తమ వాటాను గణనీయంగా పెంచుకుంటుంటే గ్రామీణ, అల్పాదాయ వర్గాల ప్రజలు అత్యవసర సేవలు, విద్య, ఆరోగ్య రక్షణ, ఆర్థికావసరాలు పరిమితంగానే పొందగలుగుతున్నారని ఆర్థిక సర్వేలు హెచ్చరిస్తున్నాయి. వరల్డ్ ఇనీక్వాలిటీ– డాటాబేస్ (విడ్) ప్రకారం 2023లో దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం ప్రజలు 22.6 శాతం జాతీయాదాయంపై ఆధిపత్యాన్ని చెలాయించారని పేర్కొంది. దేశంలో ఓ మోస్తరు సంపాదన కలిగిన 40 శాతం జనాభా వాటా జాతీయాదా యంలో 43.9 నుండి 46.6 శాతం వరకూ ఉన్నదని కుటుంబ సర్వేలు తెలిపాయి. అయితే విడ్ అంచనాల ప్రకారం జాతీయాదాయంలో మధ్యతరగతి ప్రజల వాటా గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం దేశంలో ఆదాయ అంతరాలు 1950వ దశకంలో కంటే అధికంగా ఉన్నాయని పీపుల్ రిసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ (ప్రైస్) సంస్థ ఇటీవల విడుదల చేసిన పత్రంలోని సమాచారం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసెర్చ్, ప్రైస్ తదితర సంస్థలు నిర్వహించిన కుటుంబ ఆదాయ సర్వేల ఆధారంగా ఈ పత్రాన్ని రూపొందించారు. అంటే ఆదాయ అంతరం అంతకంతకూ పెరిగిపోతోందన్నమాట. ప్రజలు ఆదాయం కోల్పోవడంతో ఉచిత పథకాల కోసం ఎగబడుతున్నారు. తమ కులాలకు, వర్గాలకు ఫలానా పథకం వర్తించలేదని గగ్గోలు చేస్తున్నారు. గతంలో వీరంతా ఇలాంటి పథకాల జోలికి రాలేదు. కానీ సంక్షోభం కారణంగా వీరంతా కొనుగోలు శక్తిని కోల్పోయారు. జనాభాలో చివరి 50 శాతంగా ఉన్న పేదలు, అల్పాదాయ వర్గాల ప్రజలు జాతీయాదాయం లో 25.5 నుండి 15.8 శాతం మధ్య ఆదాయ వాటాను కలిగి ఉన్నారని కుటుంబ సర్వేలు తెలిపాయి. కాబట్టి జాతీయ అంతర్జాతీయ నివేదికలు వేటిని పరిశీలించినా అదానీ, అంబానీ, టాటా, బిర్లా వంటి శత కోటీశ్వరుల సంపద పెరగడం, పేదలు మరింత నిరుపేదలవుతున్న వాస్తవాన్ని నివేదిస్తున్నాయి. ఇది ముమ్మాటికీ నిజం. కూలీనాలీ చేసుకునే వారు ఉన్నంతలో పస్తులు లేకెండా గడుపుతున్నారు. అఇతే పేదలు,మధ్యతరగతి ప్రజలు ఎటూ తేల్చుకోలేక నలిగిపోతున్నారు. ఈ పరిస్థితి మారాలంటే కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. ఉపాధి అకాశాలు పెంచడం, ప్రజల కొనుగోలు శక్తి పెంచేలా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా జిఎస్టీ తదితర పన్నులను తక్షణం సమీక్షించాలి.

# పవన్ కళ్యాణ... సూపర్ ఫాస్ట్ లైటెనింగ్ స్పీడ్ కలర్ చేంజింగ్ టాలెంట్



హైదరాబాద్,రంగులు మార్చడంలో పీకే ఊసరవెల్లికి ఎక్కువ, ఆక్టోపస్(మిమిక్), కట్టర్ ఫిష్‌కు కూడా ఎక్కువేనని చెప్పాలి.రంగు మార్చడానికి ఊసరవెల్లికి ఒక్క సెకండ్ ట్కెం పడితే, మిమిక్ ఆక్టోపస్‌కు రంగు మార్చడానికి 200 మిల్లీ సెకండ్‌లు సరిపోతుంది. అంటే 1/5 సెకండ్స్, వివరంగా చెపితే రెప్పపాటు కంటే చాలా వేగంగా సెకన్‌కు 5 సార్లు మిమిక్ ఆక్టోపస్ రంగులు మార్చగలదు. అయినా ఈ పీకేతో పోటీకి నిలబడగలదా అంటే నిలబడలేదనే చెప్పాలి.విషాన్ని ఇంజెక్ట్ చేయడంలో తేలు, పాములకు ఎక్కువ,(వాటిని ఎప్పుడో మించిపోయాడు) ఆస్ట్రేలియన్ బాక్స్ జెల్లీ ఫిష్, డార్ట్ కప్పలకు కూడా ఎక్కువే. ఇవి చిమ్మే విషం వల్ల సైనైడ్ కంటే వెయ్యి రేట్లు వేగంగా పని చేసి క్షణాల్లో ప్రాణం గాల్లో కలిసిపోతుంది. అయితే ఏం? ఇప్పుడు దాన్ని మించిన విషాన్ని చిమ్మగల శక్తి తనకుందని మొన్నటి ప్రసంగంతో పీకే రుజువు చేసుకున్నాడుగా.

అతి ఆషాడభూతి..

పీకేకు ఉన్న, పీకేకు మాత్రమే సొంతమైన ఆషాడభూతికే పంగనామం పెట్టగల ఈ 'అతి' అతిగొప్ప సూపర్ ఫాస్ట్ ల్కెటినింగ్ స్పీడ్ కలర్ చేంజింగ్ టాలెంట్‌ని, అర్థం చేసుకోలేక కొందరు పొరబడుతూ పవన్ కళ్యాణ్ గురించి తప్పుగా మాట్లాడుతున్నారు. లెఫ్ట్ నుంచి రైట్‌కి రూపాంతరం చెందాడనీ, నిన్నటి మాటలకూ నేటి మాటలకూ పొంతన లేదు కాబట్టి సిద్ధాంతాన్ని మార్చేశాడనీ, చేగువేరా, భగత్ సింగ్‌లు ఏమైపోయారనీ కొందరు అంటున్నారు. 'పీకేని మెంటల్ హాస్పిటల్లో చేర్పించాలి, మతిమరపు, కమెడియన్, జోకర్, బానిస, అజ్ఞాని' అంటూ మరికొందరు తీర్మానించేస్తున్నారు.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

ఏ వ్యక్తైనా తను నమ్మిన సిద్ధాంతం నుంచి పక్కకు జరుగుతూ పూర్తి వ్యతిరేక భావజాలంలోకి వెళ్లాలంటే దానికి రెండే కారణాలుంటాయి. మొదటిది తను ఇంతకాలం నమ్మింది తప్పు అని చెప్పగలిగే బలమైన కారణమైనా ఉండాలి. లేదా రెండవది తనకు ఆ సిద్ధాంతం మీద నమ్మకం, గౌరవం లేకపోయినా సరే సొంత ప్రయోజనాల కోసం దాన్ని నెత్తికెత్తుకున్నట్టు నటించడమైనా చేసుండాలి.మొదటిదానికి ఎలాంటి డొంకతిరుగుళ్లు అవసరం లేదు. గతంలో నమ్మిన భావాలు ప్రస్తుతం ఎందుకు తప్పుగా అనిపిస్తున్నాయో కారణాలు చెప్పి, వాటితో ఇతరులు కన్విన్స్ అయినా అవ్వకపోయినా ధ్కెర్యంగా తప్పుకోవచ్చు. పవన్ కళ్యాణ్ ఎంచుకుంది రెండో బాట కాబట్టే ఈ రోజు ఇంతటి నీచమైన దిగజారుడు రాజకీయాలు అవలీలగా చేసేస్తున్నాడు.

చేగువేరా సినిమా ఫ్లాప్..

పీకేకి చేగువేరా జీవితం గురించి కానీ, కమ్యూనిజం గురించి గానీ ఏమీ తెలీదు. అయినా సరే ఆ భావజాలంలో ఉన్న నిజాయితీ, న్యాయం, హక్కుల కోసం పోరాటం, కసి, ఆవేశంలాంటి ఎన్నో మంచి విషయాలు సామాన్యులను ఆకర్షిస్తాయని మాత్రం బాగా తెలుసు. అందుకే ఆ దిశగా పావులు కదిపి కెమెరా, స్టార్ట్, యాక్షన్ అంటూ ఓవర్ యాక్షన్ని ఓవర్‌గా చేసేశాడు.సినీ రంగంలో ఏమాత్రం కష్టపడకుండా అన్న అండతో అప్పనంగా అందలమెక్కిన పీకే రాజకీయాల్లో అధికారాన్ని కూడా అంతే అప్పనంగా అందుకోవచ్చని ఆశపడ్డాడు. కానీ అతనికి తెలియని విషయమేంటంటే, కమ్యూనిజం అనేది ఒక నిజమైన సిద్ధాంతం.రకరకాల పూతలతో మసిపూసి మారేడు కాయ చేసి ఒక అబద్ధాన్ని ఒప్పించినంత తెలిగ్గా నిజాన్ని ఒప్పించలేము. నిజాన్ని కమ్యూనిజాన్ని ప్రజల చేత ఒప్పించాలంటే దానికి ఎంతో నిబద్ధత, చిత్తశుద్ధి, ఓర్పు, నిజాయితీ అన్నిటికంటే ముఖ్యం ఆ సిద్ధాంతం మీద గౌరవం, ప్రేమ ఉన్న వాళ్ళు మాత్రమే సహనంతో దాన్ని భుజానికెత్తుకుని ముందుకు నడిపించగలరే తప్ప నటనతో లొంగదీసుకోవాలనుకుంటే అంతకంటే మూర?త్వం ఉండదు. అందుకే పీకే నటించిన చేగువేరా సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యింది.

సనాతని, సూపర్ డూపర్ హిట్..

సినిమాలు సమాజ శ్రేయస్సు కోసం కాకుండా కేవలం వ్యాపారంగా చూస్తూ లాభాల కోసం తీసే ఈ రోజుల్లో ఫ్లాప్ అయిన సినిమా కథతోనే మరో సినిమా తీసే మూర?పు నటులు ఉంటారా ఎవరైనా? అందుకే రాజకీయాలకు, సినిమాకు తేడా తెలియని తెలివైన నటుడు మన పీకే ఈసారి చాలా తెలివిగా బీజేపీ డ్కెరెక్షన్‌లో 'సనాతని' అనే సరి కొత్త సినిమా తీశాడు. అది సూపర్ డూపర్ హిట్. మరి డ్కెరెక్షన్ చేసింది ఎవరనుకున్నారు! 'ముత్యాలముగ్గు'లో రావుగోపాలరావుని మించిన ఆస్కార్ నటుడు మోడీ అయినప్పుడు హిట్ కాక చస్తుందా..!హిందుత్వ అనేది ఒక పెద్ద అబద్ధపు సిద్ధాంతం. దాన్ని బీజేపీ పార్టీలో ఎవ్వరూ నమ్మరు. అసలు వాళ్ళు రాముడినే నమ్మరు. నమ్మాల్సిన ఆచరించాల్సిన అవసరమే వాళ్లకు లేదు. నటనతో ప్రజలని నమ్మిస్తే చాలు. 'నిజం చెప్పులో కాలు పెట్టేలోపే అబద్ధం ఊరంతా తిరిగొస్తుంది' ప్రజల్ని ఒప్పించి మరీ.

గొప్పనటుల పార్టీ శిక్షణలో..

ఒక అబద్ధానికి వంద అబద్ధాలు చొప్పించి వీర లెవల్లో నటించి మత విద్వేషాలు రగిలించి, ఆ చితి మంటల్లో తిరుగులేని ప్రయోజనాలు పొందే అవకాశమున్న గొప్ప పార్టీ బీజేపీ. ఇందులో అందరూ గొప్ప గొప్ప నటులే. వీరి శిక్షణలో మన నటుడు మరింత రాటుదేలాడు. నటనకు ఏమాత్రం ఆస్కారం లేని చేగువేరా సిద్ధాంతంలోనే ఊగి ఊగి నటించిన పీకే ఇక 'ఈట్ డ్రామా, డ్రింక్ డ్రామా, స్లీప్ డ్రామా' పార్టీ అయిన బీజేపీ డ్రామా కంపెనీలో ఉన్నప్పుడు మరి ఆ నటన ఏ స్థాయిలో ఉండాలి.పీకే ఒక సిద్ధాంతం నుంచి మరో సిద్ధాంతంలోకి రూపాంతరం చెందలేదు. కేవలం డ్రామాలో ఒక పాత్ర నుంచి మరో పాత్రలోకి మారాడు అంతే! భవిష్యత్‌లో కూడా పీకే ఇలా నటిస్తూనే ఉండొచ్చు. రాజకీయ డ్రామాలో ఇంకా బోలెడు పాత్రలు చేయొచ్చు. రేపు పొద్దున్న ఈ 'సనాతని' సినిమా కథకు మించిన కథ దొరికితే కప్పలా అటు దూకి మరో కొత్త సినిమాలో నటనకు తెర తీయొచ్చు. అలాంటప్పుడు ఇక సొంత సిద్ధాంతమెందుకు ట్కెం వేస్ట్.స్వలాభం కోసం ఏమైనా చేస్తాడు. మొన్న జుట్టు ఎగరేస్తూ తన నోటితో బూతులు తిట్టిన వాళ్లనే ఈ రోజు ఆకాశానికెత్తుతూ వాటేసుకుంటాడు. నిన్న మెచ్చుకున్న ద్రవిడవాదాన్ని నేడు జాతీయం చేసేస్తాడు. అంతేకాకుండా అబద్ధాలతో రాజకీయానికి తల్లిదండ్రులను వాడుకోగలడు. ఏరు దాటాక తెప్ప తగలేసి నీ కర్మ అనగలడు. సినిమా అనేది అన్న పెట్టిన భిక్ష, నియోజకవర్గం వర్మ పెట్టిన భిక్ష, గెలుపు మోడీ పెట్టిన భిక్ష, డిప్యూటీ సీఎం పదవి చంద్రబాబు పెట్టిన భిక్ష. కొత్త బిచ్చగాడు పొద్దెరగడని బాధ్యతారాహిత్యంగా అధికారాన్ని అహంకారంతో అనుభవించనూ గలడు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే సామర్థ్యం కల అసమర్ధుడు. ఇలాంటి స్వార్ధపరుడిని సింపుల్‌గా మెంటల్ అనేయడం కరెక్టేనాకమెడియన్, రాజకీయ జోకర్‌లు వినోదాన్ని పంచుతారేగానీ వారి వల్ల ఎవరికీ ఏ హానీ ఉండదు. కేవలం తన స్వార్థం కోసం కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషల మధ్య చిచ్చు పెట్టి ప్రజల జీవితాలని నాశనం చేసే పీకే లాంటి వాళ్ళు కమెడియన్లు కాదు కాల సర్పాలు.బీజేపీ కాళ్ళ దగ్గర ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి,(ఈ మాట ఆత్మ గౌరవం ఉన్న వాళ్ళకే వర్తిస్తుంది.) పీకే బీజేపీ కాళ్ళ దగ్గర సాగిల పడినా అంతకంత లాభపడ్డాడు. కాబట్టి బానిస అనలేము. నిజమైన కట్టు బానిసలు మాత్రం ఇంత జరిగినా ఇప్పటికీ అతన్ని గుడ్డిగా అభిమానించే జెండా కూలీలే అవుతారు. అజ్ఞానపుటంధకారంలో మగ్గిపోతున్న జన సైనికులు, వీర వనితలు అనే విచిత్ర స్వీయ బిరుదులు తగిలించుకున్న కూలీలు మాత్రం జీత భత్యాలు లేని జూనియర్ ఆర్టిస్టులుగా నటిస్తూనే ఉండాలి.

బానిస పీడకు విముక్తి మార్గం ఒక్కటే..

బీజేపీ అండ్ కో తయారు చేసే ఇలాంటి బానిసలకు ఈ బానిసత్వం నుంచి విముక్తి లభించాలంటే ఒక్కటే మార్గం. అదేంటంటే, గతంలో కేరళలో బీజేపీ

# ప్రజాస్వామిక హక్కులకై పెనుగులాట!



హైదరాబాద్,ప్రజాస్వామ్య దేశంలో నిరసన ర్యాలీలు, ఆందోళనలు, ధర్నాలు... సర్వ సాధారణం. కానీ, పాలకవర్గం వాటిని కాలరాసే ప్రయత్నం చేయడమంటే నియంతృత్వానికి దారులు వేయడమే. ప్రశ్నించే గొంతులను నొక్కాలని ప్రయత్నించడమే. ప్రత్యేక రాష్ట్ర సాధనలో తెలంగాణ ప్రజల కలల కాణాచి ఉస్మానియా యూనివర్సిటీ. ఇది ఉద్యమాలకు కేంద్ర బిందువు. రాష్ట్రం మొత్తంగా చూస్తే ఈ విద్యార్థులదే కీలక పాత్ర. తెలంగాణ అంతటా చైతన్య యాత్రలను నిర్వహించి, ప్రజలకు అండగా నిలబడింది ఈ విద్యార్థులే.. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని యూనివర్సిటీలోకి అడుగుపెట్టనీయలేదు. అక్రమ అరెస్టులు, కేసులు ఎదుర్కొన్నారు. లాఠీ చార్జీలు, భాష్పవాయువు గుండ్లకు ఎదురొడ్డి నిలిచి పోరాడారు. ఈరోజు ఆ విద్యార్థుల పౌర ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ సర్క్యులర్ జారీ చేయడం శోచనీయం.విద్యాలయాలు ఆధునిక దేవాలయాలు. వాటి అభివృద్ధికి, భావి తరాలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాల్సిన పాలకులు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నో విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు ఉన్నా, ధిక్కార స్వరానికి ప్రతీకగా నిలిచిన విద్యాలయాల్లో ఉస్మానియాది అగ్రస్థానం. ఇప్పుడు ఉస్మానియాలో స్వేచ్ఛా వాయువులు పీల్చుకోలేని పరిస్థితికి నెట్టివేయాలనే ప్రయ త్నాలు ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీలో భావప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో యూనివర్సిటీలో నీలినీడలు కమ్ముకున్నాయి.

ఓయూ భూములు అన్యాక్రాంతం

ఉస్మానియా భూములు అన్యాక్రాంతమవుతూ వస్తున్నాయి. అగ్రికల్చర్ యూనివర్సిటీలో హైకోర్టుకు 100 ఎకరాలు కేటాయించారు. కాకతీయ యూనివర్సిటీ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన వందల ఎకరాల భూములు అదానీకి అప్పగించే ఆలోచనలో అడుగులు పడుతున్నాయి. దీంతో యూనివర్సిటీలో విద్యార్థుల నిరసనలు వెలువెత్తుతున్నాయి. అందుకే ఓయూలో ఆంక్షలు పెడుతున్నారు. అనేక విద్యాలయాల్లో, కళాశాలలో నీళ్ల ట్యాంకులు, వివిధ కార్యాలయాలు నిర్మిస్తూ ఆక్రమిస్తున్నారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిపై పూర్తి నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాలలో మౌలిక వసతుల ఏర్పా టుకు కనిపించని ప్రణాళిక. తీవ్రమవుతున్న బోధన, బోధనేతర సిబ్బంది కొరత పరిష్కారానికై దృష్టి సారించని పరిస్థితి. బడ్జెట్‌లో విద్యా రంగానికి 15% నిధులు కేటాయించాలన్న డిమాండ్ పై పాలకుల హామీ లేదు.

చైతన్య, నారాయణకు అడ్డులేదు

ప్రైవేటు విద్యాలయాల ఏర్పాటుకు విచ్చలవిడిగా అనుమతులివ్వడంతో ప్రభుత్వ రంగంలోని విద్యాలయాలు దెబ్బతింటున్నాయి. తెలంగాణ ఉద్యమకాలంలో విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకించిన చైతన్య, నారాయణ విద్యా సంస్థలు మరింతగా విస్తరిస్తున్నాయి. ప్రైవేట్ విద్యా రంగంపై అజమాయిషి కరువైంది. వీటిల్లో వసతి సౌకర్యాలపై సరైన పర్యవేక్షణ లేదు. ఫీజులపై నియంత్రణ లేదు. ఇవేవీ పట్టింపు లేకుండా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు కోసం కోట్లాది రూపాయల వెచ్చింపుకై తొందరపాటు. మెడికల్ కళాశాలల్లో సౌకర్యాలు మెరుగుదలకు చేపడుతున్న చర్యలు నామ మాత్రమే. పాలనా పరంగా ఇలా ఉంటే ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడం ఎలా సాధ్యం..?

మళ్లీ ఉద్యమాలే శరణ్యం

కార్పొరేట్, ప్రైవేటు సంస్థలలో, విద్యాలయాల్లో, విశ్వ విద్యాలయాలలో ఏ మాత్రం రిజర్వేషన్లు వర్తించవు. ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయనంత కాలం దళిత, గిరిజన, బహుజనులకు రిజర్వేషన్ల పెంపుతో ఒనగూరేది శూన్యం. జనాభా దామాషా ప్రకారం దళిత, బహుజన ఆదివాసీలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా తప్పించుకునేందుకే ఈ జిమ్మిక్కులు.. ప్రత్యేక రాష్ట్రంలో కూడా ప్రైవేటీకరణ, వనరుల దోపిడీ యదేచ్ఛగా సాగుతూనే ఉంది. అధికారంలో పాలకులు, పార్టీలు మారినంత మాత్రాన రాష్ట్ర ప్రజ లకు ప్రయోజనం కలగదు. ప్రజల జీవితాలలో మౌలిక మార్పుల సాధన కోసం తీసుకున్న చర్యలు కానరావు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక వహించిన ఉద్యమ కారులకు, అసువులు బాసిన వారికి గుర్తింపు లేదు. ఎన్నికల వాగ్దానాలు ఎండమావులు అయ్యాయి. అసెంబ్లీ సాక్షిగా జర్నలిస్టులను హెచ్చరించడం సహేతుకం కాదు. తప్పుగా భావిస్తే సూచనలు చేయాలే తప్ప బెదిరించడం మంచి పద్ధతి కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలో నాలుగో స్తంభంగా ప్రచారంలో ఉన్న మీడియాపై దాడి అప్రజాస్వామికం. తెలంగాణ పునర్నిర్మాణంలో ఉద్యమకారులకు పౌర సమాజం అండగా కదిలి నిలవాల్సి ఉంది. అధికారం దక్కించుకోవడం కోసమే రాజకీయ పార్టీలు వాగ్దానాల వరద పారిస్తాయనేది ఆచరణలో పలుమార్లు రుజువు అవుతోంది. పాలకుల హామీలు అమలుకు నోచుకోకపోతే, పౌర ప్రజాస్వామిక హక్కులు హరించే ప్రయత్నాలు మానుకోవాలి. లేని పక్షంలో పోరాటాల పురిటి గడ్డ తెలంగాణలో ఉద్యమాలు మళ్ళీ పురుడు పోసుకుంటాయి.

# ఉచ్చులో ఓ మాజీ మంత్రి, కొందరు నేతలు?

హైదరాబాద్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వ్యవహారం కొత్త మలుపు తిరుగుతుందా? కేవలం తెలుగు సెలబ్రిటీలు కాకుండా రాజకీయ నేతలు ఉన్నారా? ఎందుకు ఈ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దృష్టి పెట్టింది? మనీ లాండరింగ్ రూపంలో చెల్లింపులు జరిగాయా? పోలీసుల నుంచి వివరాలు ఈడీ తీసుకునేందుకు కారణమేంటి? ఇలాంటి ప్రశ్నలు చాలామందిని వెంటాడుతున్నాయి.

బెట్టింగ్ యాప్‌లో కొత్త కోణం

బెట్టింగ్ యాప్ వ్యవహారం యూట్యూబర్లు, కొందరు ప్రముఖుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ వ్యవహారంపై ఈడీ దృష్టి పెట్టింది. పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలు తెప్పించుకుని దర్యాప్తులో నిమగ్నమైంది. తెలంగాణకు చెందిన ఒక మాజీ మంత్రి నాలుగు ఫార్మ్ హౌస్‌ల కేంద్రంగా భారీగా బెట్టింగ్ యాప్స్ దందా నడిచినట్టు తెలుస్తోంది.

మాజీ మంత్రి చుట్టూ ఉచ్చు

చైనా నుండి భారీ మొత్తంలో ముడుపులు అందినట్టు సమాచారం. ఆ నేత ఫార్మ్ హౌస్ కేంద్రంగా ఇల్లీగల్ బెట్టింగ్ యాప్స్ లావాదేవీలు జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా శంకరపల్లి, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, మేడ్చల్ ఫార్మ్ హౌస్ కేంద్రంగా ఈ దందా నడిపారని తెలుస్తోంది. ప్రమోషన్ చేసిన వారికి చెల్లింపులు మాజీ మంత్రి అనుచరులు మధ్యవర్తిత్వం వహించినట్టు తెలుస్తోంది.మాజీ మంత్రి అండతో హైదరాబాద్ కేంద్రంగా ఏడాదికి రూ. 1200 కోట్లు మేరా లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం బయటకు రాగానే సదరు మంత్రి, ఆయన అనుచరులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసినట్టు పొలిటికల్ సర్కిల్స్ లో ఓ ఫీలర్ బయటకు వచ్చింది. ఈ గండం నుంచి ఎలా బయటపడాలో తెలియక తికమక పడుతున్నారట ఆ నేత అనుచరులు.

విచారణకు కొందరు ఎస్కేప్

మరోవైపు బెట్టింగ్ యాప్స్ కేసులో పంజాగుట్ట పోలీసులు 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. యాప్స్‌ను ప్రమోట్ చేసిన కొంతమందిపై ప్రత్యేక దృష్టి సారించారు. విచారణకు హాజరుకావాలని కొందరికి నోటీసులు జారీ చేశారు. మంగళవారం విచారణకు చాలామంది దుమ్మా కొట్టినట్టు తెలుస్తోంది. తమకు కొంత సమయం కావాలని కోరినట్టు పోలీసు వర్గాల మాట. అందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.

మూలాల్లోకి ఈడీ

ఈ క్రమంలో పోలీసుల విచారణకు వెళ్లాలా వద్దా అనే డైలామాలో పడిపోయారు నోటీసులు అందుకున్న వ్యక్తులు. బెట్టింగ్ యాప్స్ గురించి రకరకాల వార్తలు రావడంతో ఈడీ అటువైపు దృష్టి సారించింది. ప్రమోట్ చేసిన యూట్యూబర్ల గురించి ఆరా తీసిందట ఈడీ. ముఖ్యంగా వాళ్లకు జరిగిన చెల్లింపుల వ్యవహారంపై ఫోకస్ చేసింది.బెట్టింగ్ యాప్ ప్రమోషన్ చేయాలని వారికి ఎవరు చెప్పారు? ప్రమోషన్ చేసినందుకు నిధులు ఏ రూపంలో ఇచ్చారు? ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేశారా? బెట్టింగ్ యాప్ మూలాలు ఎక్కడ? యాప్ వెనుక ఇన్వెస్టర్లు ఎవరు? దేశీయంగా ఉన్నారా? చైనా ప్రమేయం ఏమైనా వుందా? అనేదానిపై లోతుగా దర్యాప్తు మొదలుపెట్టేశారు.నమోదైన కేసుల ఆధారంగా 11 మంది వివరాలను ఈడీ తెప్పించుకున్నట్లు సమాచారం. మనీ లాండరింగ్, హవాలా రూపంలో నగదు చెల్లింపులు జరిగి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తోంది. మొత్తానికి బెట్టింగ్ యాప్‌లో తీగ లాడితే డొంక ఎవరెవరు సెలబ్రిటీలు, నేతల మెడకు చుట్టుకుంటుందో చూడాలి.

# పొలిటికల్ స్టార్స్..!

హైదరాబాద్,ఆ ముగ్గురు హస్తం లీడర్లు. ఇద్దరు ఎమ్మెల్సీలు. ఓ మాజీ ఎమ్మెల్సీ. పొలిటికల్ లైఫ్ లో బిజీబిజీగా ఉంటే లీడర్స్ కాస్త వెండి తెరమీద కనిపించబోతున్నారు. ఆ ముగ్గురిలో ఓ లీడర్ ఆల్రెడీ సినిమాలో నటించి.. ఆ ఇమేజీతో రాజకీయం చేస్తుంటే.. మిగిలిన ఇద్దరు లీడర్లు మాత్రం పాలిటిక్స్‌లో గుర్తింపు వచ్చాక.. సిల్వర్ స్క్రీన్ మీద కనిపించేందుకు తహతహలాడుతున్నారు. ఇద్దరు ఎమ్మెల్సీలు నటించిన సినిమాలు రిలీజ్‌కు రెడీగా ఉండగా.. ఆ మాజీ ఎమ్మెల్యే మూవీ మాత్రం ఉగాదికి మొదలు అవుతుండగా ఆ క్రేజీ పొలిటీషియన్ ఏకంగా వన్ ఇయర్ కాల్ షీట్స్ ఇచ్చేశాడట ఆ మూవీ కోసంఇంతకు ఆ ముగ్గురు పొలిటీషియన్స్ ఎవరు వారి సినిమాల కథేంటిసినీ స్టార్లు రాజకీయాల్లోకి వచ్చి పొలిటికల్‌గా రాణించడం చూశాం. అలాంటి వాళ్లలో విజయశాంతి ఒకరు. రాములమ్మగా వెండితెరమీద ఓ వెలుగు వెలిగిన విజయశాంతి.. రాజకీయాల్లోకి వచ్చాక సినిమాలకు చాలా కాలం దూరంగా ఉన్నారు. చాలా రోజుల తర్వాత ఆ మధ్య మహేశ్‌బాబు నటించిన సరిలేరు నీకెవ్వరు సినిమాలో కీలక పాత్రలో నటించారు. ఇప్పుడు మళ్లీ సన్ ఆఫ్ వైజయంతి మూవీలో తన యాక్షన్‌తో ఆకట్టుకోబోతున్నారు. ఈ మధ్యే కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా ఎంపికైన విజయశాంతి యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులకు ముందుకు రానుండటం ఇంట్రెస్టింగ్‌గా మారింది.

పాన్ ఇండియా లెవల్‌లో వస్తున్న మూవీ..

ఇక మరో కాంగ్రెస్ నేత..లేటెస్ట్‌గా విజయశాంతితో పాటు ఎమ్మెల్సీ అయిన అద్దంకి దయాకర్ కూడా ఓ సినిమాలో నటించారు. ఇప్పటికే ఆ సినిమా షూటింగ్ దాదాపు పూర్తి అయిపోయింది. రిలీజ్‌కు సిద్ధంగా ఉన్న ఇండియా ఫైల్స్ మూవీలో కీలక పాత్రలో నటించారు అద్దంకి దయాకర్. ఉద్యమ కారుడిగా, కాంగ్రెస్ నేతగా ఉన్న అద్దంకి దయాకర్.. ఓ సినిమాలో కీలక పాత్రలో నటించడం..అది త్వరలోనే రిలీజ్ కానుండటం ఆసక్తిరేపుతోంది. ఆయన నటించిన ఇండియా ఫైల్స్ మూవీ పాన్ ఇండియా లెవల్‌లో వస్తుందన్న టాక్‌తో.. ఆ మూవీకి, అద్దంకికి మరింత హైప్ క్రియేట్ అవుతోంది.

ప్రేమ కథా చిత్రంలో ప్రేక్షకుల ముందుకు

%ఇక పాలిటిక్స్ నుంచి సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్న మరో నేత మాజీ ఎమ్మెల్యే సంగారెడ్డి జగ్గన్న. తూర్పు జయప్రకాశ్‌రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి..పొలిటికల్‌గా ఈ పేరు చాలా పాపులర్. పండుగులు, పబ్బాలు గ్రాండ్‌గా నిర్వహించి పబ్లిక్ అటెన్షన్ గ్రాబ్ చేసే జగ్గారెడ్డి..ఓ ప్రేమ కథా చిత్రంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆ మూవీ పేరే జగ్గారెడ్డి కావడందాని ట్యాగ్ లైన్ ఎ వార్ ఆఫ్ లవ్ అని ఉండటం ఆసక్తి రేపుతోంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. వచ్చే ఏడాదిలో రిలీజ్ చేయబోయే ఈ సినిమా షూటింగ్ సంవత్సరం పాటు కొనసాగనుంది. రాబోయే వన్ ఇయర్ జగ్గారెడ్డి ఈ మూవీ షూటింగ్‌లోనే బిజీగా ఉండనున్నారట.లేడీ ఫైర్ బ్రాండ్..రాములమ్మ యాక్టింగ్..ఆమె నటించిన పాత్రల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఇండియా ఫైల్స్ మూవీలో కీలక పాత్రలో యాక్ట్ చేశారు. అయితే వాళ్లిద్దరు నటించిన రోల్స్ కంటే జగ్గన్న పాత్ర సమ్‌థింగ్ డిఫరెంట్‌గా ఉంటుందట. ఓ లవ్ స్టోరీ మూవీలో జగ్గారెడ్డి తన నిజ జీవిత పాత్ర పోషిస్తున్నారు. ఆయన నేపథ్యం, రాజకీయ అరంగేట్రం..ఎలా ఎదగారనేది కూడా మూవీలో చూపించబోతున్నారట.

సీఎం అవడమే తన రాజకీయ లక్ష్యం..

జగ్గారెడ్డి మాస్ లీడర్. మూవీలోనూ ఆయనది మాస్ క్యారెక్టర్ అనే అంటున్నారు.

# గ్రామీణ రోడ్లకు టోల్‌చార్జీలు..?

హైదరాబాద్, హైవేలపై ప్రయాణించేటప్పుడు వసూలు చేసే టోల్ ఛార్జీని.. ఇక నుంచి గ్రామీణ ప్రాంతాల్లో కూడా వసూలు చేసే అవకాశం ఉంది. ఎందుకంటే.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే అర్థమవుతుంది. రాష్ట్రంలోని రహదారులను హైబ్రిడ్ అన్యూటీ మోడల్ ద్వారా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు భట్టి విక్రమార్క తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ మోడల్లో 40 శాతం ప్రభుత్వ నిధులతో, 60 శాతం ప్రైవేట్ డెవలపర్ల పెట్టుబడితో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. హైబ్రిడ్ అన్యూటీ మోడల్‌లో 2028 వరకు 17 వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులను సుమారు రూ. 28 వేల కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 769.35 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారుల నిర్మాణానికి రూ. 3,725.22 కోట్ల మేర పరిపాలనా అనుమతులు జారీ చేసింది. వీటిలో 55 కి.మీ. పొడవు కలిగిన రహదారులు, 9 వంతెనల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి వీలుగా, ప్రతి పంచాయతీకి బీటీ రోడ్డు ఉండేలా రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడైపోయిన రహదారుల మరమ్మతులు పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# సుప్రీం అసహనం...

న్యూఢిల్లీ,ట్రయిల్ కోర్టుల తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. చాలా సాధారణ కేసుల్లో దర్యాప్తు పూర్తయినప్పటికీ బెయిల్ పిటిషన్లను తిరస్కరించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పు బట్టింది. ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదని హితవు పలికింది. ఒక చిన్న కేసులో బెయిల్ కోసం దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదు. ఇక్కడ నిజాలతో సంబంధం లేకుండా చట్టం అమలుచేసే సంస్థలు కొందరు వ్యక్తులను నిర్భందించేందుకు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తారు. అలా చేయడం ఆమోదయోగ్యం కాదు. రెండు దశాబ్దాల క్రితం.. చిన్న కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టులకు చాలా అరుదుగా వచ్చేవి. ట్రయిల్ కోర్టు స్థాయిలో పరిష్కారం కావాల్సిన కేసులకు సంబంధించి బెయిల్ పిటిషన్ల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడమనేది దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అనవసరంగా వ్యవస్థపై భారం పడుతోందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక చిన్న కేసులో రెండేళ్లకు పైగా కస్టడీలో ఉన్న నిందితుడికి బెంచ్ బెయిల్ మంజూరుచేసింది. దర్యాప్తు పూర్తయి ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ నిందితుడి బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించాయి. మేజిస్ట్రేట్లు విచారించగలిగే కేసుల్లో బెయిల్ విషయాలను సుప్రీంకోర్టు ముందుకుతీసుకురావడం దురదృష్టకరమని అభయ్ ఎస్ ఓకా అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. చిన్నచిన్న నేరాలకు సంబంధించిన కేసుల్లోను బెయిల్ మంజూరుచేయడంలో ట్రయల్ కోర్టులు, హైకోర్టులు మరింత ఉదారవాద వైఖరితో వ్యవహరించాలని సూచించింది.

# దాడులకు తెగబడ్డ వారిపై కేసులు నమోదు చేయండి

అమరావతి,ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ తిరుణాలలో జరిగిన గొడవపై హోంమంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పోలీసులపై రెచ్చిపోయి రాళ్లతో దాడిచేయడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ పాకెట్లు, బాటిళ్లు, రాళ్లు విసిరిన ఘటనలో పోలీసులకు, భక్తులకు గాయాలయ్యాయి. ఈ దాడి ఘటనకు కారణమైన వారందరిపై కేసులు నమోదు చేయాలని విజయవాడ సీపీ రాజశేఖర్ బాబుకు హోంమంత్రి ఆదేశించారు. జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలవడంపై అతని పరిస్థితిపై ఆరా తీశారు. నందిగామ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించేలా చూడాలని ఆమె ఆదేశించారు. అదుపు చేసి రక్షించాలనుకున్న పోలీసులని చూడకుండా దాడికి దిగితే సహించబోమని హోంమంత్రి అనిత తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.ఎన్టీఆర్ జిల్లా, పెనుగంచిప్రోలు తిరుణాలలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. అడ్డుకున్న పోలీసుసిబ్బందిపై రాళ్లతో దాడులు చేశారు. ఈ ఘటనలో పోలీసులకు గాయాలయ్యాయి. లక్ష్మీ తిరుపతమ్మ చిన్న తిరుణాలలో తెలుగుదేశం , జనసేన, వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో ప్రభల ఊరేగింపు జరిగింది. టీడీపీకి చెందిన ప్రభ సెంటర్లో ఉండగా, వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రభ వర్గం రెచ్చగొట్టే చర్యలకు దిగింది. వాటర్ ప్యాకెట్లు బాటిళ్లు రాళ్లు విసిరారు. ఇది గమనించిన పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు వెళ్లారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పోలీసులపైనా రాళ్లు, వాటర్ ప్యాకెట్‌లు విసిరారు. ఈ ఘటనలో నలుగురు పోలీసు సిబ్బంది, ప్రజలకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన పోలీసులు.. రెచ్చగొట్టేలా దాడులు చేసిన వారిపై కేసు నమోదు చేశారు. కాగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ముందస్తు ప్రణాళికతోనే రెచ్చగొట్టే చర్యలకు దిగి.. పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు తలకు బలమైన గాయాలు అయ్యాయి. ఈ దాడిలో తెలుగుదేశం కార్యకర్తలు కూడా గాయపడ్డారు.

# బొత్స ఫైర్!

విజయవాడ:పాఠశాలల హేతుబద్ధీకరణపై సభలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి నారా లోకేష్, మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో విద్యా ప్రమాణాలు పూర్తిగా వెనుకబడి పోయాయని, 'నాడు-నేడు' పేరుతో విద్యా వ్యవస్థను పతనావస్థకు చేర్చారని టీడీపీ సభ్యులు మండిపడ్డారు.విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించిన మంత్రి లోకేష్ అన్నారు. మంత్రి లోకేష్ వ్యాఖ్యలపై వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లరనడం సరికాదని, మంత్రి గారికి ఈ లెక్క ఎక్కడి నుంచి వచ్చిందో తెలియడం లేదని బొత్స పేర్కొన్నారు.'ఉపాధ్యాయుల బదిలీల్లో రాజకీయ నాయకుల జోక్యం ఉండకూడదు. విద్య ప్రమాణాలు పెంచేందుకు కొత్త సంస్కరణలు తీసుకు వస్తున్నాం. ఐదవ తరగతి పిల్లలు రెండవ తరగతి తెలుగు చదవటానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులపై పూర్తిగా దృష్టి పెట్టాం. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి సమస్యలు లేకుండా చూస్తున్నాం. తరగతి గదుల్లో టెక్నాలజీని జోడించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా క్లాసుల నిర్వహణకు చర్యలు చేపట్టాం. వచ్చే ఏడాది నుంచి తల్లిదండ్రులకు విద్యార్థుల రిపోర్ట్ కార్డులు పంపిస్తాం. నాణ్యమైన విద్యను విద్యార్దులకు అందేలా చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి గత ప్రభుత్వమే కారణం'

# ట్రంప్ శాంతి ప్రతిపాదనలు ఏకపక్షమేనా!



వాషింగ్టన్:ట్రంప్ దృష్టి అంతా రష్యాతో చెడిపోయిన అమెరి కా సంబంధాలను పునరుద్ధరించుకోవడం పైననే ఉన్నట్లు స్పష్టం అవుతుంది. అందుకోసం రష్యాపై విధించిన ఆంక్షలను తొలగించేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు వెల్లడి అవుతుంది. చైనా నుండి ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కొ నేందుకు రష్యా- చైనాల మధ్య కొంత దూరం సృష్టించాలని ఎత్తుగడగా కనిపిస్తున్నది. మూడున్నర దశాబ్దాలుగా 'ప్రచ్ఛన్న కాలం' నాటి సోవియట్ యూనియన్‌ను శత్రుదేశంగా పరిగణించే అమెరికా విదేశాంగ విధానంలో మార్పు తీసుకు వచ్చేందుకు ట్రంప్ ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పరిణామాలు సహజంగానే ఉక్రెయిన్‌కు అశనిపాతంగా మారే అవకాశం ఉంది.అమెరికా అధ్యక్ష పదవిని రెండోసారి చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ రెండు నెలల పదవీకాలంలోనే స్వదేశంలో, విదేశాలలో కలకలం సృష్టిస్తున్నారు. ఒకవంక, సంఘర్షణలను ఆపివేసి శాంతిదూతగా పేరు తెచ్చుకునేందుకు మధ్య ఆసియాలో తాను పదవి చేపట్టేలోగా కాల్పుల విరమణ జరగాలని స్పష్టం చేశారు. మరోవంక, ఉక్రెయిన్‌లో సైతం కాల్పుల విరమణకు ప్రతిపాదిస్తూ తాను తలచుకొంటే 24 గంటలలో సాధ్యం అవుతుందంటూ చెప్పుకొచ్చారు. సంఘర్షణలకు ఒకవైపు తాత్కాలిక విరామం లభించేటట్లు ప్రయత్నం చేస్తూ మరోవంక వాణిజ్యపరంగా టారిఫ్ యుద్ధాలకు ఆజ్యం పోస్తున్నారు. టారిఫ్‌లను తగ్గించని పక్షంలో ఎదుటివారెంతగా టారిఫ్‌లు విధిస్తారో తాము కూడా అంతే విధిస్తామంటూ చెబుతున్నారు. స్వదేశంలో సైతం ఉద్యోగులను తొలగించడం, పలు అసాధారణమైన ఉత్తర్వులపై సంతకాలు చేయడం చేస్తున్నారు.రెండు నెలలకే ఇంతగా హడావుడి చేస్తున్నారు, మరో నాలుగేళ్ల వరకు ఎంతగా చెలరేగిపోతారో అంటూ గుసగుసలు బయలుదేరుతున్నాయి. ఆయన చేపట్టిన చర్యలలో చాలావరకు సంచలనాలు కనిపించడమే గాని శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు. ఆయనకు సైతం అటువంటి ఉద్దేశాలు ఉన్నట్టు లేదు. ఉదాహరణకు మధ్య ఆసియాలో కాల్పుల విరమణతో బందీల మార్పిడి వరకు విజయం సాధిస్తున్నారు. ఇది మొదటి దశ 45 రోజులకు మాత్రమే కావడం గమనార్హం. ఆ తర్వాత ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది. రెండో దశలో గాజా నుండి ఇజ్రాయెల్ సేనలు పూర్తిగా వైదొలగాలి. అటువంటి అవకాశాలు కనిపించడం లేదు. ఇజ్రాయెల్ సైతం తమ బందీలను విడిపించుకోవడం కోసమే కాల్పుల విరమణకు అంగీకరించినట్లు కనిపిస్తున్నది. మూడవ దశలో మొత్తం గాజాను పునర్నిర్మించి, అక్కడున్న పాలస్తీనా ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించి, ట్రంప్ టవర్లు నిర్మిస్తారని వస్తున్న ప్రతిపాదనలు ఎవ్వరికీ ఆమోదయోగ్యం అయ్యే అవకాశం లేదు.సుస్థిరమైన పాలస్తీనా దేశం ఏర్పాటుకు ఇజ్రాయెల్ అంగీకరిస్తుందని భావించలేం. అదే విధంగా చివరకు ఇజ్రాయెల్ ప్రయోజనాలను కాపాడటం మినహా అమెరికా సైతం స్వతంత్రించి నిర్ణయాలు ప్రకటించలేదు. అక్కడున్న సుమారు 23 లక్షల మంది పాలస్తీనా ప్రజలను తరలించి పునరావాసం కల్పించేందుకు అరబ్ దేశాలు ఏవి ముందుకు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితులలో అది ఆచరణ యోగ్యమైన పరిష్కారం కూడా కాబోదు. దానితో సుడాన్, సోమాలియా వంటి తూర్పు ఆఫ్రికా దేశాలకు తరలించేందుకు చర్చలు జరుపుతున్నారు. హమాస్ పట్ల కఠినంగా మాట్లాడుతున్న ట్రంప్ వారిని తుదముట్టడించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నది. పాలస్తీనా ప్రజలను అక్కడి నుండి తరలించి, గాజా భూభాగాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని, యుద్ధం కారణంగా కకావికలమైన ప్రాంతాన్ని బాగుచేసి, రియల్ ఎస్టేట్ అభివృద్ధి చేయాలని అమెరికా ప్రతిపాదిస్తుంది. ఇదే మాత్రం కార్యరూపం దాలుస్తుందో చెప్పలేం.ఇక ఉక్రెయిన్ విషయానికి వస్తే ఆ దేశాన్ని నట్టేట ముంచే, రష్యాతో చెలిమికి ట్రంప్ ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు చెబుతున్న శాంతి పరిష్కారం ప్రతిపాదనలు అటు రష్యా, ఇటు అమెరికాలకు ప్రయోజనం కలిగించడమే గాని, ఉక్రెయిన్‌కు ఎటువంటి భరోసా కల్పించే అవకాశం కనిపించడం లేదు. ఈ యుద్ధం ప్రారంభమైనదే ఉక్రెయిన్‌ను నాటోలో సభ్యదేశంగా చేర్చుకునేందుకు అమెరికా, ఐరోపా దేశాలు ప్రయత్నించడంతో. రష్యా మొదటి నుండి పెడుతున్న ప్రధానమైన షరతు నాటోలో చేరబోమని హామీ ఇవ్వాలని. తమ దేశ సరిహద్దుల్లోకి నాటో దళాలను అనుమతించడం రష్యా భద్రతకు ప్రమాదకరం కాగలదు. యుద్ధం ప్రారంభమైన రెండు వారాల్లోనే అటువంటి షరతుకు ఉక్రెయిన్ సుముఖత వ్యక్తం చేస్తూ రాజీకోసం సిద్ధపడుతున్న సమయంలో అమెరికా, ఐరోపా దేశాలు చేరి పడనీయలేదు. ఉక్రెయిన్ భద్రతకు తాము భరోసా అంటూ రెచ్చగొట్టాయి. ఇప్పుడు రాజీకోసం ఉక్రెయిన్ కొంత భూభాగం పోగొట్టుకొనేందుకు సైతం సిద్ధపడాలని ట్రంప్ చెబుతున్నారు.ఉక్రెయిన్‌లోని నాలుగు రాష్ట్రాలు, అంటే 20 శాతం భూభాగం ఇప్పుడు రష్యా అధీనంలో ఉన్నాయి. ఎటువంటి శాంతి ప్రతిపాదనలు సైతం ఆ భూభాగాల నుండి రష్యాను వెనుకకు పంపించే అవకాశాలు కనిపించడం లేదు. మరోవంక, ఉక్రెయిన్‌కు తాము చేసిన సైనిక సహాయానికి బదులుగా ఆ దేశంలోని అత్యంత విలువైన, అరుదైన లోహాలపై తమకు ఆధిపత్యం కల్పించాలని అమెరికా ఒత్తిడి తెస్తున్నది. అమెరికా 500 బిలియన్ డాలర్ల సైనిక సహాయం చేశామని చెబుతున్నది.వాస్తవానికి ఆ మొత్తంలో నేరుగా కేవలం 160 బిలియన్ డాలర్లు మాత్రమే ఉక్రెయిన్‌కు అమెరికా సహాయంగా ఇచ్చింది. మిగిలిన మొత్తాన్ని అమెరికాలోని ఆయుధ కంపెనీలకు అందజేసింది. ఆ విధంగా ఉక్రెయిన్ సహజ వనరులపై అమెరికా కన్నేసింది. మరోవంక, ఐరోపా దేశాల భద్రతకు తాను హామీ ఇవ్వలేనని ట్రంప్ చేతులెత్తేశారు. నాటో ఆర్టికల్ 5 ప్రకారం నాటోలోని ఏ సభ్య దేశంపై యుద్ధం జరిగినా అందులోని మొత్తం 32 సభ్య దేశాలు ఉమ్మడిగా సైనికంగా నిలబడాలి. కానీ ఇప్పుడు అమెరికా తోకాడించడంతో ఐరోపా దేశాలు ఆత్మరక్షణలో పడ్డాయి. దానితో అవి ఇప్పుడు ఉక్రెయిన్ కు సైనిక సహాయం అందించే పరిస్థితుల్లో లేవు. అందుకనే ఇప్పుడు ఫ్రాన్స్, జర్మనీ కలిసి 500 బిలియన్ డాలర్లతో ఉమ్మడి సైనిక వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించుకున్నాయి. అమెరికా ఇంకేమాత్రం తమకు సహాయకారి కాబోదని ఐరోపా గ్రహిస్తున్నది. ఈ పరిణామాలు అన్ని ఐరోపాలో మరింత అనిశ్చితకు అమెరికా ఆజ్యం పోస్తున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ట్రంప్ ప్రపాదిస్తున్న నెల రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను సూత్రప్రాయంగా ఆమోదిస్తూ, షరతులు ప్రకటిస్తున్న రష్యా కేవలం ఉక్రెయిన్ స్వాధీనంలోని కీలకమైన కురుస్క్ ప్రాంతాన్ని తిరిగి తమ స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు కాలయాపన చేస్తున్నది. ఒక గ్యాస్ పైప్‌లైన్ లోపల కిలోమీటర్లు నడిచి లోపలకు ప్రవేశించి ఉక్రెయిన్ సేనలను రష్యా దళాలు ముట్టడించాయి.

# పరీక్షలకే పరీక్ష...

హైదరాబాద్,ఏడాది కాలంగా విద్యార్థి నేర్చుకున్న జ్ఞానానికి గంట, మూడు గంటల్లో పరీక్షించడం సబబా? ఇది నిజంగా విద్యార్థి ఏడాది కాలంగా నేర్చుకున్న అభ్యసనానుభవాలను అంచనా వేయగలుగుతుందా? విద్యార్థి పరిపూర్ణ మూర్తిమత్వంను ఈ పరీక్షలు ఎంత వరకు కొలమానం? ఏళ్ళుగా వస్తున్న మన పరీక్షా విధానం పైన పలు రకాల సందేహాలు మన విద్యారంగం మేధావులు, నిపుణులు వ్యక్తం చేస్తూ వచ్చారు. బ్రిటీష్ వలసవాదం నుండి వచ్చిన ఈ పరీక్షా విధానం మెకాలేకి నకలని, అశాస్త్రీయమైనదని, సమూలంగా ఈ విధానం మారాలని, విద్యార్థులను ఒత్తిడికి గురిచేయని పరీక్ష విధానం కావాలని కోరుకున్నాం. అందులో భాగంగానే మన పరీక్షా విధానం లోని లోపభూయిష్టతను సరిదిద్ది పరీక్షా సంస్కరణలను తెచ్చుకున్నాం! విద్యాహక్కు చట్టం -2009 కొంతలో కొంతైనా మన అనుమానాలు నివృత్తి పరచగలిగింది.సరికొత్త పరీక్షా సంస్కరణకు అవకాశం కల్పించింది. విద్యాహక్కు చట్టం- 2009, సెక్షన్ 29 (1) హెచ్ ప్రకారం విద్యార్థి ఏడాది కాలంగా పొందిన అభ్యసనానుభవాలు, జ్ఞానసామర్థ్యాలు, ఒత్తిడి లేకుండా పరీక్షించే పరీక్ష విధానం నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) మన నూతన ప్రక్రియ! ఈ పరీక్షా విధానం మౌలిక మార్పులు ఏమంటే నేర్చుకున్న దంతా గంట, మూడు గంటల్లో జవాబులు రూపంలో కక్కేసే కంటే! విద్యార్థి అభ్యసన అనుభవాలతోపాటు, విద్యార్థి విద్యా సామర్థ్య అంచనా పరికరం పరీక్ష కూడా నిరంతర సమగ్ర ప్రక్రియగా ఉండాలి. అది ఏ పాఠశాలలో, ఏ విషయంలో నేర్చుకుంటున్నామో! ఆ ఉపాధ్యాయులు, ఆ అధ్యాపకులే ఎప్పటికప్పుడు నిరంతరం విద్యార్థిని అంచనా వేసుకుంటూ విద్యార్థికి పరీక్షనుండి గమనించిన అంశాలు నిరంతరం సమీక్షించి, సరిచేయడానికి సాధనంగా ఉండాలి. ఆసాధనమే నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) విధానం అని విద్యాహక్కు చట్టం స్పష్టం చేసింది. దీని ప్రకారం నిర్మాణాత్మక మూల్యాంకనం (ఎఫ్ఎ), ఇది నాలుగు దశలుగా సబ్జెక్టును విభజించి, ఆ సబ్జెక్ట్‌లో రాత సామర్థ్యం, పఠనసామర్థ్యం, ప్రాజెక్టు వర్క్ (పని అనుభవం), స్లిప్ టెస్టు (జ్ఞాన అనుభవం) వీటన్నింటినీ తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో నిర్వహించబడి ఒక్కో అంశానికి 5 మార్కులు చొప్పున సగటున 20 మార్కుల ఏడాదిలో ఇవ్వబడతాయి. ఈ నిర్మాణాత్మక పరీక్ష అనేది తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుల వ్యక్తిగత బోధన సరిదిద్దడానికి, ఉపాధ్యాయులు తమ బోధనానుభవాలు సమీక్షకు, విద్యార్థి తాను వెనకబడిన విషయం తనకు తాను తెలుసుకోవడానికి తోడ్పడుతుంది. ఒక విధంగా ఇవి మనం ఎంతోకాలంగా కోరుకున్న మార్పులే! ఇకపోతే సిసిఇలో రెండవ అంశం ఏమంటే సబ్జెక్టు రెండు భాగాలుగా విభజించి ఒక్కో సెమిస్టర్‌కు 40 మార్కుల చొప్పున రెండు సెమిస్టర్‌లు కలిపి 80 మార్కులకు విద్యనేర్చిన పాఠశాలలోనే సంగ్రాహనాత్మక మూల్యాంకనం జరుగుతుంది. ఈ సంగ్రాహ నాత్మక మూల్యాంకనంలో విద్యార్థి పొందిన జ్ఞానంతో పాటు, ఆయా సబ్జక్టులలోని ఆరు అభ్యసన సామర్థ్యాలు పరీక్షించబడతాయి. అంటే విద్యార్థి ఆ వయసులో పొందాల్సిన విద్యా సామర్థ్యాలు ఎంతో కొంత నిజాయితీగా అంచనా వేయగలిగిన విధానం. ఈ మొత్తం విద్యార్థి పొందిన 100 మార్కుల నుండి 3 నుండి 10 వరకు గ్రేడులను ఆయా విద్యార్థులకు పొందిన మార్కులను బట్టి ఇస్తారు.ఈ గ్రేడులే విద్యార్థి సమగ్ర మూల్యాంకనం అంచనాగా భావించి బోధనా లక్ష్యాలు విద్యార్థికి అందేలా ముఖ్యంగా సబ్జక్టు ఉపయోగపడే అంశంపైనే ఈ పరీక్షలు! విద్యార్థి, ఉ



పాధ్యాయులు చేతిలో నిరంతర సమగ్ర సాధనం అయిన ఈ నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానం వచ్చి15 ఏళ్ళుగడిచినా నేటికీ దాన్ని సంపూర్ణంగా అమలు జరిపే ధైర్యం పాలక వర్గాలకు లేదు. ఇటు అర్థం చేసుకొని అనుసరించే స్థితికొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులలో లోపించింది. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యా వ్యవస్థ ఒత్తిడి తట్టుకోలేక, మానెటరింగ్ వ్యవస్థ సరిదిద్దుకోలేక, ఇప్పటికే సంగ్రహనాత్మక మూల్యాంకనం వార్షిక పరీక్షగా, పాత వాసనలతో నిర్వహిస్తున్న 80 మార్కులకు గాను, నిర్మాణాత్మక మూల్యాంకనం 20 మార్కులు కలిపి పాత పద్ధతిలో 100మార్కులకు ఎస్ఎస్‌సి పరీక్ష నిర్వహించపూనుకుంది. ఇది ఈ ఏడే అమలు పరచాలని అధికారులు ప్రయత్నించారు కూడా? కానీ, కొన్ని సాంకేతిక సమస్యల వలన మరుసటి ఏడాదికి వాయిదా వేసుకున్నారు. అంతేకాకుండా మరో పరీక్ష మార్పుకు సైతం ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సరైన గ్రేడ్ రాని పక్షంలో మే నెలలోపు మరో ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించి ఒకేసారి ఫలితాలు ప్రకటిస్తామని ప్రకటించారు. అంటే పాత సప్లిమెంటరీ పరీక్షలు తిరిగి పునరుద్ధరణ అన్న మాట! అంటే ప్రైవేటు విద్యా వ్యవస్థ కోరికలు తూచా తప్పకుండా అమలు జరపడానికి అధికారులు, పాలకులు సంసిద్ధం అయ్యారనే విషయం సుస్పష్టం అవుతుంది. అభ్యసనానుభవాలు, పాఠ్యాంశాలు అధ్యయనంలో అంతర్లీనంగా, అంతర్భాగంగా జరగాల్సిన నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) ప్రక్రియ మన పరీక్ష విధానంలో ఒత్తిడి లేని సులభతరం అయిన విధానాలకు సూచికనై ఉండగా, దాన్ని బలోపేతం చేయకపోగా ఎటు తిరిగీ మన పాత మూల్యాంకనం విధానం వైపు మన విద్యాధికారుల ఆలోచనలు కొనసాగడంలో అంతర్యం ఏమిటో ఒకపట్టాన అర్థం కాదు? మనం చట్టంగా తెచ్చుకున్న సులభం, సరళతరం అయిన పరీక్ష సంస్కరణ ఒత్తిడి లేని నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియకు బదులు దొడ్డిదారిన తెస్తున్న పాత మూల్యాంకనం విధానం ఏ రూపంలో తెచ్చినా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. మనం దీర్ఘకాలిక పోరాటంతో విద్యాహక్కు చట్టంగా తెచ్చుకున్న నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ సంపూర్ణంగా అమలు చేయాలనే డిమాండ్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు ముందుకు పోవాల్సి ఉంది. ఒత్తిడి, విద్యార్థుల ఆత్మహత్యలు లేని సంపూర్ణ పరీక్షా సంస్కరణ అమలు దిశగా అడుగులు వేద్దాం. మన పాఠశాల పరీక్షా వ్యవస్థలో సరైన మార్పులను మాత్రమే స్వాగతిద్దాం.

# ఆనంద్ మహీంద్రా హర్షం

ముంబై, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 9 నెలలు చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ సురక్షితంగా భూమికి తిరిగి రావడంపై ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా హర్షం వ్యక్తంచేస్తూ, ఆమెకు స్వాగతం పలికారు. ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోయినా కూడా సునీత ఇన్ని రోజులు ఎంతో ధైర్యంగా ఉన్నారని.. తిరిగి భూమికి చేరుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం ఆమెతో జరిగిన ఓ సరదా సంఘటనను ఈసందర్భంగా గుర్తు చేసుకున్నారు. రెండేళ్ల క్రితం వాషింగ్టన్‌లో రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ, థర్డ్‌ఐటెక్ సహ-వ్యవస్థాపకురాలు బృందా కపూర్ లతో పాటు- భారత సంతతి అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను తాను కలిసినట్లు- పేర్కొంటూ అప్పటి పోస్ట్‌ను షేర్ చేశారు. అందులో 'టె-క్నాలజీ సంస్థల సమావేశం ముగిసిన తర్వాత లంచ్ మీటింగ్‌కు మాకోసం ఏర్పాటు-చేసిన బస్‌ను ముకేశ్ అంబానీ, బృందా కపూర్, నేను మిస్ అయ్యాం. దీంతో ఉబర్ క్యాబ్‌లో వెళ్దామని.. కారు కోసం వేచి చూస్తున్న సమయంలో సునీతా విలియమ్స్ కనిపించారు. ఆమెతో సెల్ఫీ తీసుకొని.. ఉబర్‌కు బదులుగా స్పేస్ షటిల్‌లో మమ్మల్ని తీసుకెళ్లగలరా? అని అడిగాం. ఇలాంటి క్షణాన్నే వాషింగ్టన్ మూమెంట్ అని పిలుస్తారేమో' అని ఆయన రాసుకొచ్చారు. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు చేరుకున్న సునీత , బుచ్ విల్మోర్ స్పేస్ క్యాప్సూల్‌లో తలెత్తిన లీకేజీ సమస్య వల్ల తొమ్మిది నెలల పాటు- రోదసిలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ 'ఫ్రీడమ్'లో వీరితోపాటు- మరో ఇద్దరు వ్యోమగాములు బుధవారం తెల్లవారుజామున సురక్షితంగా ఎ÷-లోరిడా సముద్ర జలాల్లో దిగారు. వారు క్షేమంగా భూమిని చేరుకోవడంతో ప్రపంచ దేశాలు ఆనందం వ్యక్తంచేశాయి.

# ఇంఫాల్‌లో మళ్లీ ఘర్షణలు

ఇంఫాల్,మణిపూర్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా చురాచంద్‌పూర్ జిల్లాలో ఇరు వర్గాలు రాళ్లు రువ్వుకున్నాయి. కాల్పులకు దిగాయి. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్‌ను ప్రయోగించడంతో పాటు- గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో పలువురికి తీవ్రగాయాలైనట్లు- సీనియర్ అధికారి ఒకరు బుధవారం తెలిపారు. మణిపూర్‌లోని చురాచంద్‌పూర్ జిల్లాలో మంగళవారం రాత్రి జోమి కౌన్సిల్ మరియు హ్మార్ ఇన్పురు తెగల మధ్య శాంతి ఒప్పందం కుదిరిన కొన్నిగంటల తర్వాత .. ఇరు వర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. జోమి సంస్థకు చెందిన జెండాను కొందరు దుండగులు కూల్చివేసేందుకు యత్నించారు. ఆగ్రహించిన జోమి వర్గం హ్మార్ వర్గంపై కర్రలతో దాడికి దిగింది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కొంతమంది వ్యక్తులు ప్రత్యర్థులపై కాల్పులు జరపడంతో పాటు- ఆస్తులను కూడా ధ్వంసం చేశాయని సీనియర్ అధికారి తెలిపారు. ఇరు వర్గాలను నియంత్రించేందుకు భద్రతా దళాలు గాల్లోకి కాల్పులు జరిపాయని అన్నారు. అయితే ఎవరు ఎవరిపై కాల్పులు జరిపారో స్పష్టంగా తెలియలేదని అన్నారు. జోమి స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లాలో బంద్‌కు పిలుపునిచ్చింది.

# అసలేం జరిగింది?

ముంబై:కొన్ని అంశాలను తెలుగు మీడియా పెద్దగా ఫోకస్ చేయదు. ఎందుకు? అంటే.. దానికి ప్రత్యేక కారణం ఏమీ ఉండదు. కొన్ని అంశాల మీద అవగాహన లేకపోవటం.. మరికొన్ని అంశాల్నివ్యక్తిగత అభిరుచుల కోణంలో చూసి.. వదిలేస్తుంటారు. ఇప్పుడున్న డిజిటల్ ప్రపంచంలో అలా జరుగుతుందా? అన్న సందేహం రావొచ్చు. దానికి నిలువెత్తు నిదర్శనం మహారాష్ట్ర లోని నాగపూర్ లో చెలరేగిన హింసాకాండ ఉదంతాన్ని చెప్పాలి. అక్కడ రెండు వర్గాల మధ్య నెలకొన్ని వివాదం.. ఆ పట్టణాన్ని అతలాకుతలం చేస్తోంది.మార్చి 17 రాత్రి చోటు చేసుకున్న హింసాత్మతక ఘటనలు.. 19 ఉదయానికి కూడా తెలుగు మీడియాలో పెద్దగా కనిపించకపోవటం గమనార్హం. అదే సమయంలో జాతీయ మీడియాలో ఈ ఉదంతాలకు ఇచ్చిన ప్రాధాన్యత ఎక్కువే. అసలేం జరిగింది? నాగపూర్ ఎందుకు అట్టుడుకుతుంది? లాంటి అంశాలకు సంబంధించిన గ్రౌండ్ రిపోర్టుపై వివిధ జాతీయ మీడియా వర్గాలు ఏం చెబుతున్నాయన్నది చూస్తే..నాగపూర్ లో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు కారణం.. ఒక తప్పుడు సమాచారంగా చెప్పొచ్చు. కొన్ని వదంతులు నాగపూర్ లో మతపరమైన ఘర్షణలకు కారణంగా మారాయని చెప్పాలి. శాంతికి నిలయమైన ఈ నగరంలో ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకోవటంపై విస్మయం వ్యక్తమవుతోంది. నాగపూర్ అల్లర్ల వెనుక భారీ కుట్ర ఉందని చెబుతున్నారు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్. అరాచక శక్తుల్ని ఉక్కుపాదంతో అణిచివేస్తామని స్పష్టం చేశారు. మరోవైపు ఈ అంశంపై మాజీ ముఖ్యమంత్రి ఉద్దవ్ ఠాక్రే మాట్లాడుతూ.. అశాంతికి కారణమైన ఔరంగజేబ్ సమాధిని ఎందుకు తొలగించటం లేదు? అని ప్రశ్నించారు.ఇంతకూ అసలేం జరిగిందన్న వివరాల్లోకి వెళితే.. ఇటీవల చావా చిత్రం విడుదల కావటం.. శివాజీ మహారాజ్ కొడుకు శంభాజీ మహారాజ్‌ను ఔరంగజేబ్ చిత్రహింసలకు గురి చేసి హతమార్చటం.. ఈ చిత్రం తీవ్ర భావోద్వేగానికి గురి చేయటం తెలిసిందే. ఇదే సమయంలో మహారాష్ట్రలో ఉన్న ఔరంగజేబ్ సమాధిని తొలగించాలన్న డిమాండ్ ఒక వివాదంగా మారింది. ఔరంగజేబు మీద ఆగ్రహం పెల్లుబికటం.. అతడిపై కోపాన్ని భారీ నిరసన ప్రదర్శన రూపంలో తెలియజేశారని ముఖ్యమంత్రి ఫడ్నవీస్ వెల్లడించారు. ఔరంగజేబ్ సమాధి వద్ద వీహెచ్ పీ.. బజరంగ్ దళ్ అధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేయటం. అనంతరం మత గ్రంథాన్ని కాల్చారన్న తప్పుడు సమాచారం వదంతుల రూపంలో వ్యాపించింది. ఇదే నాగపూర్ అల్లర్లకు ప్రదాన కారణం. దీంతో హిందూ.. ముస్లిం వర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఇక్కడ నాగపూర్ నగరం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. అత్యంత ప్రశాంతమైన నగరాల్లో దీనికి పేరుంది. 1993 నుంచి ఇప్పటివరకు ఈ నగరంలో మతపరమైన అల్లర్లు జరగలేదు. అలాంటి నగరం ఈ రోజున హింసాకాండతో మండుతోంది. చావా చిత్రం తర్వాత ఔరంగజేబు అక్రత్యాలు ప్రజలకు తెలిశాయని.. శాంభాజీ మహారజ్ వీరత్వంపై జనాలు ప్రశంసలు కురిపిస్తున్నట్లుగా చెబుతున్న ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్. ఔరంగజేబ్ సమాధిపై జరుగుతున్న చర్చ వేల.. సోమవారం రాత్రి సోషల్ మీడియాలో ఒక పుకారు వ్యాపించింది. దీంతో వందలాది మంది అల్లరిమూకలు కాసేపటికే చేరుకున్నారు. వీరు రాళ్ళు.. కర్రలు.. రాడ్లు.. కత్తులు.. .ఈటెలు.. హాకీ కర్రలతో వచ్చి.. రోడ్డు మీద వెళుతున్న వారిని వెంటాడి మరీ దాడులకు తెగబడ్డారు. పలు వాహనాలకు నిప్పు పెట్టారు. ఇదే సమయంలో రోడ్ల మీద హింసకు పాల్పడిన వారు నడిపే వాహనాలకు నంబర్ ప్లేట్లను తొలగించి మరీతిరగటం చూస్తే.. అంతా పథకం ప్రకారమే జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సందర్భ ంగా పలు వాహనాలు దగ్ధం కావటమే కాదు.. 33 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు.ఈ మొత్తం వ్యవహారంపై ముఖ్యమంత్రి స్పందించారు. అల్లర్లకు సంబంధం ఉన్న యాభై మందిని పోలీసులు అరెస్టు చేసినట్లుగా వెల్లడించారు. కొన్ని అరాచకశక్తులు హింసను రెచ్చగొట్టాయని.. మొత్తం 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ కొనసాగుతున్నట్లుగా వెల్లడించారు.

# మోడీ.. తెగిన బంధాలు అతికేనా?



న్యూఢిల్లీ,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మార్చి 30 న నాగాపూర్ వెళుతున్నారు. అందులో విశేషం ఏముంది, అనుకుంటే అనుకోవచ్చును, కానీ వుంది. అందుకే, మోదీ నాగపూర్ టూర్ అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. నిజమే మోదీ ఒక్క నాగపూర్ అనేముంది, దేశంలో ఎక్కడికైనా వెళతారు. ఆమాట కొస్తే దేశంలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడికైనా వెళతారు. వెళుతూనే ఉన్నారు. 2014 లో ఆయన ప్రధాని బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశం మొత్తం ఎన్నిసార్లు చుట్టి వచ్చి వుంటారో లెక్కలేదు. నిజానికి, ఈ 11 ఏళ్లలో ఆయన నాగపూర్ కూడా అనేక మార్లు పర్యటించి ఉంటారు. అయితే గత పర్యటనలు వేరు, ప్రస్తుత పర్యటన వేరు, అంటున్నారు. అందుకే, మోదీ నాగాపూర్ పర్యటన కోసం, బీజేపీ, ఆర్ఎస్ఎస్ పరివారం మాత్రమే కాదు, అన్య రాజకీయులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు . అవును ప్రధాని మోదీ ఈ నెల 30న, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధ్వర్యంలో పనిచేస్తున్న, మాధవ్ నేత్రాలయ, కంటి పరిశోధన సంస్థ నూతన భవన సముదాయం శంఖుస్థాపన కార్యక్రమలో పాల్గొనేందుకు నాగపూర్ వెళుతున్నారు. ఆయనతో పాటుగా కేంద్ర మంత్రి నితిన్ గడ్గరీ, మహా రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవీస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని మాధవ నేత్రాలయం తెలిపింది. అయితే మోడీ నాగపూర్ పర్యటన కేవలం అందు కోసమేనా అంటే కాదు. అసలు విషయం, విశేషం అది కాదు.అదే రోజున నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి హోదాలో నాగపూర్ లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో తొలి సారిగా అడుగు పెడుతున్నారు. అవును 2014లో ప్రధానమంత్రి పదవి చేపట్టినప్పటిన తర్వాత మోదీ ఇంతవరకు సంఘ్ ప్రధాన కార్యాలయంలో కాలు పెట్ట లేదు. ఇన్నాళ్ళు ఆయనకు ఆ అవసరం ఎందుకు రాలేదో, ఇప్పుడు ఎందుకు వచ్చిందో ఏమో కానీ, ఢిల్లీ నుంచి దిగి వచ్చి నాగాపూర్ సంఘ్ కార్యాలయం చేరుకుంటున్నారు. ఆ విధంగా చూసినప్పుడు మోదీ నాగపూర్ పర్యటన ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది.అంతే కాదు, ఈ సందర్భంగా ఆయన ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ సహా సంఘ్ పెద్దలతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నట్లు వస్తున్న వార్తలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. గతంలోనూ సంఘ్ పెద్దలతో మోదీ సమావేశమయ్యారు. అయితే ఇప్పుడు ప్రత్యేకంగా భేటీ కావడం ఆసక్తిని పెంచుతోంది.అదొకటి, అయితే, అంతకంటే ముఖ్యమైన విషయం, మరొకటి వుంది. ఈ సమావేశంలో ఎంతో కాలంగా వాయిదా పడుతూ వస్తున్న బీజేపీ అధ్యక్షుని ఎంపిక మొదలు, బీజేపీ %-% ఆర్ఎస్ఎస్ సంబంధాలకు సంబంధించి అనేక కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 2024 లోక్ సభ ఎన్నికలకు ముందు, బీజేపీ,ఆర్ఎస్ఎస్' మధ్య పొరపొచ్చాలు పై కొచ్చాయి. కాషాయ కూటమితో కమల దళం దూరం పెరిగింది. అప్పట్లో బీజేపీఅధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ ,ఆర్ఎస్ఎస్ సంబధాల గురించి చేసిన వ్యాఖ్యలు, వివాదాన్ని సృష్టించాయి. ఒక ఇంటర్వ్యూ లో ఆర్ఎస్ఎస్ – బీజేపీ సంబంధాల గురించి మాట్లాడుతూ నడ్డా, అటల్ బిహారీ వాజపేయి హయాంలో,బీజేపీ బలహీనంగా ఉండడం వలన,అప్పట్లో ఆర్ఎస్ఎస్ అవసరం బీజేపీకి ఉండేది, ఇప్పుడు మోదీజీ నాయకత్వంలో పార్టీ బాగా బలపడింది. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ అవసరం మాకు లేదు అని అన్నారు. సహజంగానే నడ్డా సమాధానం,ఆర్ఎస్ఎస్ పెద్దలకు నచ్చలేదు. ఆర్ఎస్ఎస్ పెద్దలకే కాదు, సాధారణ, స్వయం సేవకులు (సంఘ్ కార్యకర్తలు) ఎవరికీ నచ్చలేదు. అయితే అటు బీజేపీ, ఇటు ఆర్ఎస్ఎస్ నాయకులు మాత్రం అబ్బే అలాంటిదేమీ లేదు సమాచార లోపం వల్ల వచ్చిన చిన్న సమస్య సాల్వయిపోయిందని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయితే నడ్డా, అనాలోచిత ప్రకటనకు బీజేపీ మూల్యం చెల్లించింది. సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేక పోయింది. అందుకు ఇంకా ఇతర కారణాలు ఉన్నా, నడ్డా ప్రకటనతో బీజేపీ – ఆర్ఎస్ఎస్ మధ్య పెరిగిన దూరం కూడా ఒక ప్రధాన కాణంగా బీజేపీ గుర్తించింది. అందుకే, మోదీ షా జోడీతో సహా బీజేపీ మహా' నాయకులకు తత్వం బోధ పడింది. బీజేపీ మళ్ళీ మాతృ సంస్థ ఒడికి చేరింది. ఫలితంగా, ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎనికల్లో బీజేపీ అనూహ్య విజయాలను సొంత చేసుకుంది. 3 0 ఏళ్ల తర్వాత ఢిల్లీలో గెలిచింది. హర్యానా, మహారాష్ట్రల్లో వరసగా రెండవ సారి విజయం సాధించింది. ఈనేపథ్యంలో, ప్రధాని హోదాలో మోదీ, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో తొలి సారిగా కాలు పెట్టడం, సంఘ్ పెద్దలతో ప్రత్యేకంగా సమావేశం కావడం, జాతీయవాద సంస్థల సంబందాల విషయంగానే కాకుండా రాజకీయంగానూ, ప్రాధాన్యతగల అంశంగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.ఈ పరిణామలను కొంచెం లోతుగా విశ్లేషించుకుంటే, ఒక విధంగా ఆర్ఎస్ఎస్ తో బీజేపీ సంబంధాలు పూర్తి స్థాయిలో సర్దుకోలేదని,ఇంకా శేషం మిగిలే ఉందన్న సందేహం మిగులుతుంది. అంతా బాగుంది అనుకుంటే ఈ భేటీ అవసరం ఏముందనే ప్రశ్న వస్తుంది. మరో విధంగా చూస్తే. ప్రధాని మోదీ ఏ 75 పదవిలో కొనసాగేందుకు ఆర్ఎస్ఎస్ ఆశీస్సులు అవసరమని గుర్తించి, సంఘ్ పెద్దలతో సాన్నిహిత్యం పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నారని అనుకోవచ్చని అంటున్నారు. నిజానికి ఇటీవల కాలంలో మోదీ మాతృ సంస్థకు దగ్గరయ్యే ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నారు. కొద్ది రోజులక్రితం క్రితం,ఎంఐటీకి చెందిన లెక్స్ ఫ్రిడ్మన్ పోస్ట్ చేసిన పోడ్ కాస్ట్ లోనూ మోదీ ఆర్ఎస్ఎస్ ను పొగడ్తలతో ముంచెత్తారు. ఆర్ఎస్ఎస్ ఒక సంస్థ మాత్రమే కాదు. భారతీయతకు జీవం పోసే, మహోన్నత ఉద్యమం అంటూ మెచ్చుకున్నారు. జాతి ప్రయోజనాల విషయంలో ఆర్ఎస్ఎస్ కు ఉన్న నిబద్ధతను, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల అంకిత భావాలను గొప్పగా చెప్పు కొచ్చారు. ఆర్ఎస్ఎస్ వంటి సంస్థ ప్రపంచంలో మరొకటి లేదని అన్నారు. అలాగే, ఆర్ఎస్ఎస్ ద్వారానే తాను తన జీవిత పరమార్ధాన్ని అర్థం చేసుకున్నానని చెప్పుకొచ్చారు. ఇదొకటే కాదు అంతకు ముందు ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనంలోనూ మోదీ మరాఠీ భాషతో ఉన్న సంబంధానికి నాగపూర్ (ఆర్ఎస్ఎస్)తో తనకు తనకున్న అనుబంధాన్ని ముడివేశారు. అదే క్రమంలో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఆర్ఎస్ఎస్ సజీవంగా ఉంచుతోందని అన్నారు. ఇలా, ఆర్ఎస్ఎస్లో పుట్టి పెరిగిన మోదీనే ఆర్ఎస్ఎస్కు దగ్గరయ్యేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించవలసి రావడం నిజం అయితే, బీజేపీ, ఆర్ఎస్ఎస్ మధ్యనే కాదు, ఆర్ఎస్ఎస్ – మోదీ మ ధ్య సంబంధాలు కూడా అంత సజావుగా లేవన్న అనుమానాలకు బలం చేకూరుతుంది.అలాగే, మోదీ స్వయం ప్రకటిత రిటైర్మెంట్ ఏజ్ కి (75) దగ్గర పడుతున్న నేపథ్యంలో, పదవీ కాలం పొడిగింపు కోసం, మోదీ ప్రయత్నిస్తున్నారా నాగపూర్ టూర్ పరమార్ధం అదేనా, అందుకోసమేనా, మోదీ ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో అడుగుపెడుతోంది ..అందుకోసమేనా ఈ పొగడ్తలు, ఈ భేటీలు ? అంటే, ఏమో అయినా కావచ్చును, అన్నదే నాగపూర్ సమాధానం.

# కడపలో మహానాడు.. పట్టు నిలుపుకోవడానికి టీడీపీ స్కెచ్...

కడప:కడపలో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది . వైఎస్ కుటుంబానికి కంచుకోటగా ఉంటూ వచ్చిన ఉమ్మడి కడప జిల్లాలో ఇప్పటికే టీడీపీ పాగా వేసింది. 2024 ఎన్నికలలో జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలకు గానూ ఏడింటిని కైవసం చేసుకున్న కూటమి జగన్‌కు షాక్ ఇచ్చింది. ఇప్పుడదే జిల్లాలో లోకేశ్ కనుసన్నల్లో మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. కడప జిల్లా రాజకీయాలంటే ఠక్కున గుర్తుకు వచ్చేది వైఎస్ కుటుంబం. నాటి కాంగ్రెస్ పార్టీ నుంచి నేటి వైసీపీ వరకు%ొ% అక్కడంతా ఆ కుటుంబానిదే హవా. అందుకు తగ్గట్టే గడిచిన పాతికేళ్ళలో ఉమ్మడి కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీకి నామ మాత్రపు సీట్లే దక్కాయి. మొత్తం పది అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 2004లో ఒక్క చోట మాత్రమే గెలిచింది తెలుగుదేశం. 2009లో కూడా అదే పరిస్థితి. 2014లో కూడా రాజంపేటలో మాత్రమే తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గెలిచారు. ఇక 2019కి వచ్చేసరికి మొత్తం పదికి పది సీట్లు దక్కించుకుని వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది వైసీపీ. కానీ%ొ% ఆ తరువాత మాత్రం సీన్ మారిపోయింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని విధంగా తెలుగుదేశం పుంజుకుంది. ఉమ్మడి కడప జిల్లాలోని పది స్థానాలకు గాను ఏడు చోట్ల కూటమి ఎమ్మెల్యేలు గెలిచారు. కడప జిల్లాలో టిడిపి ఐదు, బిజెపి ఒకటి, జనసేన ఒకటి చొప్పున అసెంబ్లీ స్థానాలు దక్కించుకున్నాయి. మొట్ట మొదటిసారిగా జిల్లాలో బిజెపి, జనసేన బోణీ కొట్టాయి. రాష్ట్రంలో అధికారం రావడం ఒక ఎత్తయితే కడప జిల్లాలో సత్తా చాటుకోవడం మరో ఎత్తు అనుకుంటున్నారట తెలుగుదేశం ముఖ్యులు. జగన్ అడ్డాలో ఏకంగా ఏడు ఎమ్మెల్యే సీట్లు కొట్టి సత్తా చాటామని, ఇక ఈ పట్టు తగ్గకుండా చూసుకోవాలని డిసైడ్ అయ్యారంట. అలా పట్టు నిలుపుకునే క్రమంలోనే ఈసారి తెలుగుదేశం మహానాడును కడపలో నిర్వహించాలని నిర్ణయించారు. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత ఒక్కసారి కూడా కడపలో మహానాడు నిర్వహించలేదు. దాంతో ఇప్పుడు మొదటిసారిగా



కడప జిల్లాలోమహానాడు నిర్వహించడమే కాకుండా వైసీపీ అడ్డాలో తమ బలాన్ని నిరూపించుకోవాలని అనుకుంటున్నారట తెలుగుదేశం పెద్దలు. కడపలో మహానాడు నిర్వహించాలని పార్టీ పొలిట్ బ్యూరో నిర్ణయించడం వెనక రీజన్ ఇదేనని చెబుతున్నాయి టీడీపీ వర్గాలు. కడప లాంటి ఉమ్మడి జిల్లాలో కూటమి ఏడు సీట్లు గెలవడంతో%ొ% స్థానిక ఎమ్మెల్యేలకు కూడా అదే స్థాయి ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి దక్కింది. మరో ముగ్గురు ఎమ్మెల్యేలను ప్రభుత్వ విప్ పదవులు వరించాయి. కేడర్లో కూడా జోష్ నింపడానికి కడప జిల్లాలో మొట్టమొదటిసారిగా కనీవినీ ఎరుగని రీతిలో మహానాడు నిర్వహించాలనుకుం టున్నట్టు సమాచారం. నిర్వహణ కోసం కడప నగరంలోని నాలుగు ప్రాంతాలను పరిశీలించిన జిల్లా నేతలు అధిష్టానానికి నివేదికలు పంపారట. ఇప్పటికే వైసిపి అడ్డాలో పాగా వేసిన తెలుగుదేశంమహానాడు నిర్వహణతో తన సత్తా చాటాలని అనుకుంటోందట. అటు వైసిపికి బిగ్ షాక్ ఇవ్వడంతోపాటు కార్యకర్తలకు భరోసా కల్పించాలన్నదే టిడిపి ధ్యేయంగా చెప్పుకుంటున్నారు.

# బొత్స రూటెటు?.. వైసీపీలో కొత్త టెన్షన్?



అమరావతి,మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ, శాసన మండలిలో వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ పక్క చూపులు చూస్తున్నారా? వైసీపీలో ఉంటే రాజకీయ భవిష్యత్ ఉండదని భయపడుతున్నారా? ఒక్కడిగా కాకుండా ఒక టీమ్ గా పార్టీని వీడాలని ప్రణాళికలు రచిస్తున్నారా? అంటే రాజకీయవర్గాల నుంచే కాదు వైసీపీ వర్గాల నుంచి కూడా ఔననే సమాధానమే వస్తున్నది. బొత్స పార్టీ మార్పు గురించి ఇప్పుడే కాదు గతంలోనూ వార్తలు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తరువాత బొత్స సత్యనారాయాణ కొద్ది కాలం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఈ క్రమంలో ఆయన అడుగులు జనసేన వైపు పడుతున్నాయన్న ప్రచారం ఓ రేంజ్ లో చేరింది. సరిగ్గా ఆ ప్రచారం జోరుగా ఉన్న సమయంలోనే ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో జగన్ మోహన్ రెడ్డి వ్యూహాత్మకంగా ఉమ్మడి విశాఖపట్టణం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణను రంగంలోకి దించారు. తెలుగుదేశం కూటమి నుంచి ఎవరూ పోటీ చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయిపోయింది. ఆ సమయంలో విజయనగరం జిల్లాకు చెందిన వ్యక్తికి విశాఖపట్టణం నుంచి ఎమ్మెల్సీ ఇవ్వడంపై వైసీపీలో కొందరు నేతలు అసంతృప్తి వ్యక్తం చేసినా జగన్ ఖాతరు చేయలేదు. బొత్స పార్టీ మారకుండా ఆపడానికి ఆయనను ఎమ్మెల్సీ చేయడమే మార్గమని జగన్ భావించారు. ఎమ్మెల్సీగా ఎన్నికయిన తరువాత బొత్స సత్యనారాయణ వైసీపీలో కీలకంగా మారారు. మండలిలో విపక్ష నేతగా కూటమి ప్రభుత్వ నిర్ణయాలపై మంత్రులను నిలదీస్తున్నారు. వైసీపీ తరపున గెలిచిన 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి గైర్హాజరు కావడంతో, మండలిలో విపక్ష నేతగా వైసీపీ వాయిస్ ను బొత్స బలంగా వినిపిస్తూ వస్తున్నారు. తాను ఒక్కడిగా కాకుండా సభలో వైసీపీ సభ్యులందరికీ మాట్లాడే అవకాశం ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. దీంతో జగన్ కంటే బొత్స బెటర్ అన్న అభిప్రాయం వైసీపీ ఎమ్మెల్సీలలో ఏర్పడిందని పార్టీ వర్గాలే అంటున్నాయి. అయితే వైసీపీలో అంతర్గతంగా జరుగు తున్న పరిణామాలతో బొత్స ఒకింత అసంతృప్తితో ఉన్నారనీ, జగన్ మోహన్ రెడ్డి తీసుకుంటున్న పలు నిర్ణయాలను ఆయన పార్టీ వర్గాల వద్ద నిర్మొహమాటంగా తప్పుపడుతున్నారనీ అంటున్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నించాలని తద్వారా ప్రజల్లోకి మంచి మెస్సేజ్ వెళ్తుందని, అసెంబ్లీకి వెళ్లకుండా ఉండటం ద్వారా ప్రజా సమస్యల్ని వైసీపీ పట్టడంలేదన్న భావన కలుగు తుందని బొత్స జనగ్ కు చెప్పారనీ, అసెంబ్లీకి హాజరు కావాలని సూచించారనీ, అయితే జగన్ ఆ సూచనను పట్టించుకోకపోవడంపై బొత్స అసంతృప్తితో ఉన్నారనీ పార్టీ వర్గాలలో చర్చ జరుగుతోంది. ఇక్కడే బొత్స తన అసంతృప్తిని బహిర్గతం చేయకుండా చాపకింద నీరులా తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారని పార్టీ వర్గాలలో చర్చ జరుగుతోంది.సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న బొత్స సత్యనారాయణకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నేతలతోనూ సత్సంబంధాలు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్ లో మంత్రిగా కొనసాగిన బొత్స.. అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. వైఎస్ఆర్ మరణం తరువాత కూడా కాంగ్రెస్ పార్టీలో ముఖ్యనేతల్లో ఒకరిగా కొనసాగారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రజాబలం కలిగిన నేతగా బొత్స ఎదిగారు. 2014 ఎన్నికల తరువాత వైసీపీలో చేరిన బొత్సకు జగన్ ప్రాధాన్యత ఇచ్చా రు. జగన్ కేబినెట్ లో బొత్స మంత్రిగా పని చేశారు. అప్పట్లో జగన్ తీసుకున్న పలు నిర్ణయాలపై బొత్స బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా సినీ హీరోల పట్ల జగన్ ప్రవర్తనను బొత్స ఖండించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ముఖ్యంగా చిరంజీవి పట్ల జగన్ వ్యవహరించిన తీరు పట్ల బొత్స తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని అప్పట్లో వార్తలు వచ్చాయి. చిరంజీవి కుటుంబంతో బొత్సకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తోనూ బొత్సకు మంచి సంబంధాలు ఉన్నాయి. గత అసెంబ్లీ సమావేశాల సమయంలో పవన్ కల్యాణ్ వద్దకు వెళ్లి బొత్స ప్రత్యేకంగా మాట్లాడారు. అంతే కాదు.. పవన్ కల్యాణ్‌ను బొత్స విమర్శించిన సందర్భాలు చాలా తక్కువే. దీనికి తోడు జగన్ కు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాల్సిందేనని వైసీపీ ఎమ్మెల్యేలంతా డిమాండ్ చేసిన సమయంలో.. జగన్ కు కాకపోతే కనీసం పవన్ కు అయినా ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని బొత్స అన్నారు. శాసనమండలిలో కానీ.. మరో చోట కానీ పవన్ కు వ్యతిరేకంగా బొత్స ఒక్క మాట కూడా మాట్లాడకపోవడాన్ని ఎత్తి చూపుతూ బొత్స పార్టీ మార్పు యోచన చేస్తున్నారన్నడానికి ఇదే తార్కానమంటున్నారు వైసీపీ వర్గీయులు. బొత్స సత్యనారాయణ రాజకీయంగా ఢక్కామొక్కీలు తిన్న రాజకీయ నేత. సరైన సమయంలో సరైన నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నట్లుగా ఆయన తీరు ఉందని ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ రోజు కాకపోతే రేపైనా బొత్స జనసేనసేలో చేరడం ఖాయమన్న వాదన వైసీపీ వర్గాల నుంచే గట్టిగా వినిపిస్తోంది. మండలిలో ప్రతిపక్ష నేతగా బొత్స అధికార పక్షాన్ని దీటుగా ఎదుర్కొంటున్నారు. సభలో ప్రతిపక్ష నేత పాత్రకు న్యాయం చేస్తూనే సభ బయట మాత్రం అధికార పక్ష నేతలతో , మరీ ముఖ్యంగా జనసేన నేతలతో సఖ్యతగా ఉంటున్నారు. బొత్స ఈ తీరే ఆయన వైసీపీని వదిలేస్తారనీ, జనసేన గూటికి చేరతారనీ ప్రచారం జరగడానికి దోహదం చేస్తున్నది. జగన్ ఏకపక్ష వైఖరి, ఇటీవలే ఉత్తరాంధ్రలో సీనియర్ మోస్ట్ నేతగా తానున్నా%ొ% తనను కాదని ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ గా మాజీ మంత్రి కురసాల కన్నబాబును నియమించిన తీరుపై బొత్స అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు. మొత్తంగా చూస్తే బొత్స ఎప్పుడు గడపదాటతారా అన్న టెన్షన్ వైసీపీలో కనిపిస్తోంది.

# పెను మార్పుల దిశగా కాంగ్రెస్.. ఇక డీసీసీలకు ఫుల్ పవర్స్..

హైదరాబాద్, వరస ఓటములతో కుదేలవుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థాగత పునరుద్ధరణకు పార్టీలో రంగం సిద్ధమవుతుంది.ఇన్నాళ్ల ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కేంద్రంగా ఉన్న పార్టీ నిర్మాణాన్ని మార్చాలని భావిస్తున్నారు. వికేంద్రీకరణకు గ్రాండ్ ఓల్డ్ పార్టీ ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లా కాంగ్రెస్ కమిటీలకు ఎక్కువ అధికారాలు ఇవ్వాలని, వాటికి ప్రాధాన్యత, స్వయం ప్రతిపత్తి ఇవ్వడంతో పాటు బలోపేతం చేయాలని భావిస్తోంది. ఇప్పటికే ఈ సంస్థాగత మార్పులను పార్టీ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ సమర్థించారు. ఈ మార్పులకు మద్దతు ప్రకటించారు. 1971ల ఇందిరా గాంధీ శకం నుంచి ప్రేరణ పొంది, పార్టీ జిల్లా కాంగ్రెస్ కమిటీలను (డీసీసీ)లను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌ల ఉన్నతస్థాయి సమావేశంలో, రాహుల్ గాంధీ తన దీర్ఘకాలిక సంస్కరణల ఎజెండాలో భాగంగా జిల్లా యూనిట్లకు సాధికారత కల్పించాలని సూచించారు.స్థానిక పార్టీ యూనిట్లను బలోపేతం చేయడంపై రాష్ట్ర నాయకుల నుంచి రాహుల్ గాంధీ అభిప్రాయాలను కోరారని, టిక్కెట్ల పంపిణీ, సమస్యల ఎంపికతో సహా పార్టీ వ్యవహారాల్లో జిల్లా అధిపతులకు నిర్ణయాత్మక పాత్ర ఉండాలని ఆయన కోరుకుంటున్నారని జాతీయ మీడియా పేర్కొంది. పార్టీ అట్టడుగు స్థాయి బలాన్ని పునరుద్ధరించడానికి, కోల్పోయిన రాజకీయ స్థానాన్ని తిరిగి పొందడానికి ఇది ఒక వ్యూహంగా భావిస్తున్నారు.ఈ



చర్యల్లో భాగంగా జిల్లా అధ్యక్షులకు పూర్తి అధికారం ఉండేలా కాంగ్రెస్ తన ప్లాన్‌ని సిద్ధం చేస్తోంది. దీనిని అమలు చేయడానికి పార్టీ చీఫ్ ఖర్గే, రాహుల్ గాంధీలు మార్చి 27-28 , ఏప్రిల్ 3 తేదీలలో ఇందిరా భవన్‌లో మూడు బ్యాచ్‌లలో దాదాపు 750 జిల్లాల అధిపతులతో నేరుగా చర్చించనున్నారు. అభిప్రాయాలు సేకరించిన తర్వాత, ఏప్రిల్ 8న అహ్మదాబాద్ లో జరిగి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో తుది బ్లూప్రింట్‌ను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత ఏప్రిల్ 9న చర్చించిన తర్వాత అధికారం ఆమోదం తెలుపనున్నారు. 2025-26లో కీలకమైన రాష్ట్ర ఎన్నికలు జరుగనున్న తరుణంలో, ఈ నిర్మాణాత్మక సవరణలు సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేస్తుందని పార్టీ అధినాయకత్వం భావిస్తోంది.

# మరోసారి విచారణకు రండి.. అధికారులకు ఏకసభ్య కమిషన్ నోటీసులు




తిరుమల:తిరుమలలో వైకుంఠద్వారా దర్శనానికి సంబంధించిన టోకెన్ల జారీ సందర్భంగా తిరుమలలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణ మూర్తి విచారణ కొనసాగుతోంది..తిరుమల, తిరుపతిలో విచారణ సాగుతోంది.. అయితే, రేపు మరోసారి విచారణకు హాజరు కావాలంటూ అధికారులకు నోటీసులు జారీ చేసింది తొక్కిసలాట ఘటమపై ఏర్పాటు చేసిన న్యాయ కమిషన్.. ఈ రోజు దాదాపు నాలుగు గంటల పాటు టీటీడీ మాజీ జేఈవో సహా పలువురి అధికారులను విచారించింది కమిషన్.. గతం కంటే మెరుగైన భద్రత ఏర్పాట్లు చేపట్టామని కమిషన్ ముందు ఘటన జరిగిన సమయంలో జేఈవోగా ఉన్న గౌతమి తెలిపారు.. ఇక, రేపు తొక్కిసలాట ఘటన సమయంలో ఎస్పీగా విధులు నిర్వహించిన ఐపీఎస్ అధికారి సుబ్బరాయుడు, మాజీ టీటీడీ జేఈవో గౌతమి, టీటీడీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, డీఎస్పీ రమణ కుమార్, 13 మంది టీటీడీ జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు సీఐలు, 6 మంది ఎస్ఐలను, సీవీఎస్‌వో, మాజీ సీవీఎస్‌వోలను, ఈ నెల 21వ తేదీ నుంచి నుంచి 23వ తే దీ వరకు మూడు రోజులపాటు 42 మంది విజిలెన్స్ సెక్యూరిటీ స్టాఫ్,32 మంది పోలీసు సిబ్బందిని జస్టిస్ సత్యనారాయణ మూర్తి కమిషన్ విచారించనుంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో పురోగతి.. నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు

హైదరాబాద్,తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ లో కీలక పరిణామం చోటు చేసుకుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చోటు చేసుకున్న ఫోన్ ట్యాపింగ్ ను పదేళ్ల తర్వాత అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వెలుగులోకి తెచ్చింది.

అయితే కేసులో ఎలాంటి పురోగతి సాధించకపోవడానికి ప్రధాన కారణం ప్రధాన నిందితులు విదేశాల్లో ఉండటమే. వారు తిరిగి వస్తే కానీ దర్యాప్తు ముందుకు సాగదు. ప్రధాన నిందితులైన ఎస్ ఐబి మాజీ ఓ ఎస్టీ ప్రభాకర్ రావు, మరో కీలక నిందితుడు అరువెల్ల శ్రవణ్ రావ్ లకు రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయ్యాయి .ఇంటర్ పోల్ నుంచి సిబిఐ ద్వారా తెలంగాణ సిఐడికి సమాచారమందడంతో హైద్రాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. వీరిరువురిని అదుపులో తీసుకుని కేంద్రానికి అప్పగించే పనిలో ఇంటర్ పోల్ ఉంది. వారిద్దరిని సాధ్యమైనంత త్వరగా ఇండియా తీసుకురావడానికి కేంద్రం కసరత్తు ప్రారంభించింది. కేంద్ర హెూం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ హైద్రాబాద్ పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నారు. వీరిద్దరిని అమెరికాలో



తాత్కాలిక (ప్రొవిజినల్ ) అరెస్ట్ చేసి డిపోర్టేషన్ ప్రక్రియ ద్వారా ఇండియా పంపే అవకాశం ఉంది. ప్రొవిజినల్ అరెస్ట్ ను నిందితులు అక్కడి కోర్టులో సవాల్ చేసే అవకాశం ఉంది. రాజకీయ కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా ప్రొవిజినల్ అరెస్ట్ అని నిందితులు కోర్టులో పిటిషన్ వేసే అవకాశం లేకపోలేదు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com